

కనకగిరి గుట్టల్లో పర్యటిస్తున్న మంత్రి తుమ్మల



వ్యూ పాయింట్ వద్ద మంత్రి తుమ్మల, తదితరులు

కనకగిరి గుట్టల్లో తుమ్మల ట్రెక్కింగ్

- పెనుబల్లి మండలంలోని అటవీ పర్యాటక ప్రాంతం సందర్శన
- పులిగుండాల నుంచి వీరభద్రుడి ఆలయం వరకు పర్యటన
- ప్రకృతి అందాలను ఆస్వాదించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఎమ్మెల్యేతో కలిసి వనబస్సు ప్రారంభం

పెనుబల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): కనకగిరి గుట్టలు.. పెనుబల్లి మండలంలోని ఈ పచ్చని కొండ కోనల ప్రాంతం గురించి తెలియని వారుండరు. పర్యాటకులను అమితంగా ఆకట్టుకునే అడవి అందాలు ఇక్కడి ప్రత్యేకం. కాకతీయుల కాలం నాడు నిర్మించిన వీరభద్రుడు కొలువైన ఆధ్యాత్మిక రమణీయ ప్రదేశం. అలాంటి ప్రాంతంలో ఎకో టూరిజం ద్వారా రూ.3.50కోట్లతో చేస్తున్న అభివృద్ధి పనులను శుక్రవారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. పులిగుండాల ప్రాజెక్టు నుంచి వీరభద్రస్వామి ఆలయం వరకు అడవిలో సుమారు 3 గంటల పాటు పర్యటించిన ఆయన ప్రకృతి అందాలను ఆస్వాదించారు. కొండలను ఎక్కి వ్యూ పాయింట్ల వద్ద నుంచి బైనాక్యులర్‌తో కొండ కోనలను చూసి పరవశించారు. ఎమ్మెల్యే మట్టా రాగమయితో కలిసి వన బస్సును ప్రారంభించారు. వీరభద్రస్వామి ఆలయంతోపాటు పులిగుండాల ప్రాంతంలో పర్యాటకులు బస చేసేందుకు ఏర్పాటుచేసిన కుటీరాలను ఆయన పరిశీలించారు. ఈ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న ఈ ప్రాంతంలో పులిగుండాల ప్రాజెక్టులో బోటింగ్‌తోపాటు ఎకో టూరిజం ద్వారా అభివృద్ధి చేస్తున్న గదులు, హోటళ్లపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అక్కడ పర్యావరణ పరిరక్షణ సమితుల బాధ్యులు, స్థానిక గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ పోడు భూముల కోసం అడవులను నరకడం వల్ల పర్యావరణానికి పెనుముప్పు వాటిల్లుతుందని, అడవులను నరకొద్దని సూచించారు. ఆ తర్వాత సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం సహకరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నీలాద్రి అటవీ ప్రాంతాన్ని కూడా ఎకో టూరిజం ద్వారా అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పోలీసు కమిషనర్ సునీల్‌దత్, డీఎఫ్‌వో సిద్ధార్థ విక్రమ్‌సింగ్, సీసీఎఫ్ భీమానాయక్, కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ఏసీపీ రఘు, పలువురు అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వానాకాలం వచ్చేసింది.. సీజనల్ వ్యాధులు ప్రబలే సమయం ముంచుకొస్తోంది. ఈ క్రమంలో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అప్రమత్తంగా ఉండాల్సిన ఖమ్మం జిల్లా ఆస్పత్రి యంత్రాంగం.. ఏర్పాట్లపై అంతగా దృష్టి పెట్టడం లేదని తెలుస్తోంది. సీజనల్ జలుబు, జ్వరాలు ప్రబలి.. రోగుల సంఖ్య పెరిగితే దానికి తగినట్లుగా సేవలందించేందుకు సిద్ధంగా ఉండాల్సిన వైద్య ఆరోగ్య సిబ్బందిలో నిర్లిప్తత కనిపిస్తోందని, ఉమ్మడి జిల్లాకు ఎంతో కీలకమైన ఖమ్మం ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న పలు మిషన్ల దుమ్ముదులపాల్సి ఉందని, పనిచేయని వాటిని సిద్ధం చేయాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



(ఫైల్)

సీజనల్.. ముంచుకొస్తోంది!

- ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో కానరాని అప్రమత్తత
- నిర్ధారణ పరీక్షల ఏర్పాట్లపై దృష్టిపెట్టని అధికారులు
- టీ హబ్ సెంటర్‌లో రసాయనాల కొరత
- అందుబాటులో మూడు ఆటోమేటిక్ ఎమటాలజీ అనలైజర్లు

ఖమ్మం కలెక్టరేట్, మే 30 (ఆంధ్రజ్యోతి): నైరుతి ప్రవేశించింది. వర్షాలు పడుతున్నాయి. పరిసరాలు చిత్తడిగా మారుతున్నాయి. సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలే సమయమిది. ఈ క్రమంలో ప్రజలకు వైద్య సేవలందించాల్సిన అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో నిర్లిప్తంగా ఉన్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి జిల్లాకు ఎంతో కీలకమైన ఖమ్మం ఆస్పత్రిలో జిల్లాలో గత రెండేళ్లుగా డెంగీ కేసులు ఎక్కువగానే నమోదవుతున్నాయి. గతేడాది కల్లూరు మండలంలో డెంగీ కేసులు 50వరకు నమోదయ్యాయి. రెండేళ్లక్రితం చింతకాని, బోనకల్ మండలాల్లో డెంగీతో ప్రాణనష్టం సంభవించింది. ఎంవీపాలెం పీహెచ్‌సీ, మంచుకొండ పీహెచ్‌సీల్లోనూ డెంగీ కేసులు అధికంగా నమోదయ్యాయి. ఏటా ఈ సీజన్‌లో ఏ ఆస్పత్రిలో చూసినా డెంగీ బాధితులే కనిపిస్తుంటారు. ప్లేట్‌లెట్స్ తగ్గిపోయి ప్రాణనష్టం సంభవించడంతో పాటు ఎన్నో కుటుంబాలల్లో తమ వారు ప్లేట్‌లెట్స్ కౌంట్ తగ్గిపోవడంతో లక్షలకు లక్షలు ఖర్చుచేసి ఆర్థికంగా ఇబ్బందులు పడిన సంఘటనలు జరుగుతున్నాయి. ఇలాంటి చేదు అనుభవాలు ఈ సీజన్‌లో ఎదురవకుండా ముందస్తు ఏర్పాట్లు ఏమైనా చేస్తున్నారా.. అనేది ప్రశ్నార్థకంగా మారింది. జిల్లా ఆస్పత్రిలో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, చికెన్‌గున్యా లాంటి కేసులకు రక్తనమూనాలను సేకరించాల్సి ఉంటుంది. సీజన్‌లో తరచుగా ప్రజలు వీటి బారిన పడుతుంటారు. అలాంటి కిట్ మెథడ్ ద్వారా టైఫాయిడ్, వైడాల్ పరీక్ష ద్వారా టైఫాయిడ్, ఎలీసా ద్వారా డెంగీ, ర్యాపిడ్ మెథడ్, ఎలీసా ద్వారా చికున్‌గున్యా జ్వరాలను నిర్ధారిస్తుంటారు. వీటిని ప్రైవేటు డయాగ్నసిస్ కేంద్రాల్లో చేయించుకోవాలంటే ఒక్కో రోగి కనీసం రూ.1500 నుంచి రూ.2500 వరకు వెచ్చించాల్సి ఉంటుంది.

ఈ మిషన్ల దుమ్ము దులపాలి..

జిల్లా ఆస్పత్రిలో మూడు ఆటోమేటిక్ ఎమటాలజీ అనలైజర్ మిషన్లున్నాయి. వీటికి దుమ్ముదులిపి సిద్ధం చేయాల్సి ఉంది. గతంలో ఇవి మూలన పడటంతో అసలైన (మిగతా 4వ పేజీలో)

ఖమ్మానికి భట్టి.. భద్రాద్రికి తుమ్మల

- రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఇన్‌చార్జ్ మంత్రులు వీరే
- జాతీయ పతాకాలను ఆవిష్కరించనున్న అమాత్యులు
- వరంగల్‌లో జరిగే వేడుకల్లో పాల్గొననున్న పొంగులేటి

ఖమ్మం కలెక్టరేట్, మే 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన 2వ తేదీన జరిగే వేడుకలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం ఇప్పటికే కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆవిర్భావ సంబురాలకు గాను అన్ని జిల్లాలకు ఇన్‌చార్జ్ మంత్రులను నియమించగా.. వారు జాతీయ పతాకాలను ఆవిష్కరించనున్నారు. ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లాకు ఇన్‌చార్జ్‌గా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క.. పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. అలాగే భద్రాద్రి కొత్తగూడెం ఇన్‌చార్జ్‌గా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జాతీయజెండాను ఎగురవేసి అక్కడి కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇక రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వరంగల్ జిల్లాలో నిర్వహించే ఆవిర్భావ వేడుకల్లో జాతీయ జెండాను ఎగురవేస్తారు. ఈ మేరకు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కె రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మొత్తం మింగేశారు!

- మర్కోడు ఎంపీపీఎస్ పాఠశాల పనుల్లో గోల్‌మాల్
- పనులు చేయకుండానే రూ.30లక్షలు స్వాహా
- ప్రహరీ, వంట గది, మరుగుదొడ్ల నిర్మాణ నిధులు హాంఫట్
- అధికారులు, కాంట్రాక్టర్ పాత్రపై అనుమానాలు



పిల్లర్ల దశలోనే ఆగిన పాఠశాల నిర్మాణం,



ఈ గుంత ఉన్న ప్రాంతంలోనే మరుగుదొడ్డి నిర్మించినట్టు చూపి బిల్లు కాజేశారు..

ఆళ్లపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): 'వడ్డించేవాడు మనవాడైతే విందులో ఏ మూలన కూర్చుంటేనేం అన్నీ వస్తాయన్న' చందంగా ఉంది.. మర్కోడు ఎంపీపీఎస్ నిధుల స్వాహా వ్యవహారం. పనులు చేయకుండానే కాగితాలపై పూర్తి చేసినట్టు చూపిన ఆర్‌అండ్‌బీ, గ్రామ పంచాయతీ అధికారులు.. భారీ మొత్తంలో బిల్లులు మింగేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంలో సుమారు రూ.30లక్షలకుపైగా కాంట్రాక్టర్‌కు హారతి పళ్లెంలో ముట్టజెప్పారన్న విషయం స్థానికంగా కలకలం రేపుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలం మర్కోడు ఎంపీపీఎస్ పాఠశాల అభివృద్ధి పనులకు గాను 2023లో ఉపాధి హామీ పథకం ద్వారా ప్రహరీ నిర్మాణానికి రూ.21లక్షలు, వంటగది నిర్మాణానికి రూ.3.50లక్షలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.7లక్షలు కేటాయించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అప్పటి జిల్లా అధికారులు ఇంజనీరింగ్ అధికారులను పరుగులు పెట్టించడంతో నిర్మాణ పనులు మొదలు పెట్టకుండానే పనులు పూర్తి చేసినట్టుగా రికార్డులు నమోదు చేశారు. దీంతో ఆయా అభివృద్ధి పనుల డబ్బులు పంచాయితీ ఖాతాల్లో జమయ్యాయి. ఇదే అదనుగా భావించిన ఆర్‌అండ్‌బీ, గ్రామపంచాయితీ అధికారులు తిలాపాపం తలపిడికెడు అన్నట్టుగా ఇటీవల ఓ కాంట్రాక్టరును తీసుకువచ్చి, పనులను అప్పగించించినట్టే అప్పగించి.. ఆయా పనులు కనీసం పునాదులు తీయకుండానే రెండు నెలల క్రితం సంబంధిత గుత్తేదారుడితో కలిసి మొత్తం మింగేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అతడి ఖాతాలో రూ.30 లక్షలు వేసినట్లు విశ్వసనీయ సమాచారం. నిధులు స్వాహా విషయం బయటకు పొక్కడంతో తమ ఉద్యోగాలు ఎక్కడ ఊడుతాయోనని, ఉన్నత స్థాయి అధికారులకు రికార్డులు ఎలా చూపించాలని, నిధులు ఎలా రికవరీ చేయాలో తెలియక అధికారుల్లో గుబులు మొదలైంది. సమస్య పెద్దది కాకముందే అధికారులు హుటాహుటిన పనులు మొదలు పెట్టేందుకు పరుగులు పెడుతున్నారు.

కాగితాలపై లెక్కలు చూపి అడ్డగోలుగా అవినీతి

నిర్మాణ పనులను మొదటి నుంచి పర్యవేక్షించి నిర్మాణాలు పూర్తయిన తరువాత నాణ్యత, కొలతల ఆధారంగా ఎంబీ రికార్డు చేసి, డివిజన్, జిల్లా స్థాయి అధికారుల సమక్షంలో సంబంధిత రికార్డులు పరిశీలించి, పూర్తి చేసిన పనికి గాను సంబంధిత కాంట్రాక్టర్‌కు నిధులు విడుదల చేయాల్సి ఉంటుంది. కానీ ఆ నిబంధనలను తుంగలో తొక్కి అడ్డగోలుగా అవినీతికి పాల్పడ్డారు. మారుమూల గ్రామం కావడంతో ఎవరూ పట్టించుకోరని, ఏ ఆధారాలు లేకుండానే ఎఫ్‌టీవో సృష్టించి గ్రామ పంచాయతీ ద్వారా సంబంధిత కాంట్రాక్టర్‌కు రూ.30లక్షలకు పైగా చెక్ అందజేసినట్టు తెలుస్తోంది. ఈ విషయమై ఆంధ్రజ్యోతి ఆర్‌అండ్‌బీ, గ్రామపంచాయతీ అధికారులను వివరణ కోరగా నిందలను (మిగతా 4వ పేజీలో)

నేడు సింగరేణి ఏరియాకు డిప్యూటీ సీఎం రాక

- రూ.10కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

రుద్రంపూర్ (సింగరేణి), మే 30 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం సింగరేణి కొత్తగూడెం ఏరియాలో పర్యటించనున్నారు. రూ.10కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టనున్నట్టు సింగరేణి యాజమాన్యం శుక్రవారం ప్రకటించింది. రూ.3.50కోట్ల వ్యయంతో నిర్మించిన కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజరు కార్యాలయంతో పాటు రూ.6కోట్లకుపైగా వ్యయంతో నిర్మించిన ఏరియా వర్క్‌షాపును ప్రారంభించనున్నారు. కొత్తగూడెం ఏరియాలోని ఓపెన్‌కాస్టు అనుమతులు వచ్చిన నేపథ్యంలో నూతనంగా జనరల్ మేనేజరు కార్యాలయం, ఏరియా వర్క్‌షాపును నిర్మించారు. త్వరలోనే వీకే 7 ఓపెన్‌కాస్టును కూడా ప్రారంభించనున్నట్టు అధికారులు ప్రకటించారు. ఈ కార్యక్రమాలకు సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సింగరేణి డైరెక్టర్లు కొప్పుల వెంకటేశ్వర్లు, ఎల్‌వీ సూర్యనారాయణ, సత్యనారాయణరావు హాజరుకానున్నారు. కొత్తగూడెం వన్‌టౌన్, టూటౌన్ సీఐలు కరుణాకర్, ప్రతాప్ భద్రత ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీలోకి ముగ్గురు..

- భట్టి, రేణుక, పొంగులేటికి అవకాశం
- సీనియారిటీ, సామాజిక సమీకరణాల నేపథ్యంలో చోటు

4



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు
స్వల్పగాయాలతో బయటపడ్డ రాజశేఖర్, గీత దంపతులు, పిల్లలు

చెత్తకుప్పే కాపాడింది..

- వైరా హైలెవల్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- ఎదురుగా వచ్చిన డీసీఎం, కారును ఢీ కొట్టిన లారీ
- 50 అడుగుల లోతులో ఉన్న నదిలోకి కారు, లారీ పల్టీ
- కారుపై పడిన టన్నుల బరువున్న ఇనుపచువ్వలు
- చెత్తలో కూరుకుపోయి.. ఎయిర్‌బెలూన్లు తెరుచుకుని..
- ప్రాణాలతో బయటపడ్డ కారులోని ఐదుగురు
- ఇద్దరికి తీవ్రంగా.. ఐదుగురికి స్వల్ప గాయాలు
- భయానకంగా సంఘటన దృశ్యాలు

5

మురిపిస్తున్న మ్యూజియం

- ఫిదా అవుతున్న ఆబాల గోపాలం
- నోరూరిస్తున్న వంటకాలు, ఆకట్టుకుంటున్న పరిసరాలు
- ఇప్పటి వరకు 50 వేల మంది సందర్శన
- భద్రాద్రి మ్యూజియం నిర్వహణ బాగుందంటూ మంత్రి సీతక్క కితాబు
- రూ.కోటి మంజూరు చేసిన కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ



మ్యూజియం ప్రాంగణంలో సందర్శకుల సందడి

భద్రాచలం, మే 30 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియం కొత్త హంగులతో సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఈ మ్యూజియంతో పాటు బోటింగ్, బాక్స్ క్రికెట్, రుచికరమైన గిరిజన వంటకాలు, సంప్రదాయ గిరిజన అల్లికలు ఆబాల గోపాలాన్ని అలరిస్తున్నాయి. భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ ప్రత్యేక చొరవతో ఈ మ్యూజియానికి సరికొత్త హంగులు సమకూరుతున్నాయి. రూ.30 లక్షలతో మ్యూజియంతో పాటు పరిసరాలను మరింత అందంగా సందర్శకులు మురిపించి మైమరిపించేలా తీర్చిదిద్దారు. ఇందుకు ఐటీసీ నవభారత్ సంస్థలు తమవంతు సహకారం అందించాయి. గిరిజన మ్యూజియం బ్రోచర్లను ఈ ఏడాది మార్చి 30న ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు హైదరాబాద్ నుంచి ఆవిష్కరించారు. కాగా ఏప్రిల్ 7న శ్రీరామ మహాపట్టాభిషేకాన్ని తిలకించడానికి వచ్చిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు.

ఫిదా అవుతున్న జనం..

గిరిజన మ్యూజియాన్ని అదనపు హంగులతో తీర్చిదిద్దిన క్రమంలో ఈ ఏడాది ఏప్రిల్ 7 నుంచి సందర్శకులను అనుమతించారు. నాటి నుంచి నేటి వరకు చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ మ్యూజియాన్ని తిలకించేందుకు తరలివస్తుండటం విశేషం. ఇప్పటి వరకు పెద్దలు 40వేలు, చిన్నారులు 10వేల వరకు ఈ మ్యూజియంను తిలకించారు. చిన్నారులను ఆకట్టుకునేందుకు బోటింగ్, జారుడుబండ, ఉయ్యాల ఇతరత్రా ఆట విడుపు సామగ్రి అందుబాటులో ఉండటంతో వారి ఆనందానికి అవధుల్లేవు. అలాగే యువతను బాక్స్ క్రికెట్ ఎంతగానో ఆకట్టుకుంటోంది. అదేవిధంగా మహిళలు సైతం అధిక సంఖ్యలో వస్తుండటంతో ఆ ప్రాంగణమంతా సందడి నెలకొంటోంది. ఇదే సమయంలో (మిగతా 4వ పేజీలో)

'నకిలీ'లపై ఉక్కుపాదం

- నిషేధిత పత్తి విత్తనాల పట్టివేత
- ఆంధ్రా నుంచి వచ్చినట్టు గుర్తింపు
- తనిఖీల్లో ఏన్కూరు మండలంలో 564 కిలోలు స్వాధీనం
- 11 మందిపై కేసు.. 9 మంది అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీపీ సునీల్ దత్

5

మావోయిస్టులారా... అజ్ఞాతం వీడండి..

- భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు
- మావోయిస్టు పార్టీకి చెందిన 17 మంది ఛత్తీస్‌గఢ్ దళ సభ్యుల లొంగుబాటు
- ఒక్కొక్కరికి రూ.25వేలు ఆర్థిక సహాయం అందజేత

భూధార్ నమోదు తప్పనిసరి

- ప్రభుత్వ పథకాల లబ్ధికి ఎంతో అవసరం
- వివరాల డిజిటలైజేషన్‌లో భాగంగా కేంద్ర నిర్ణయం
- జోరుగా సాగుతున్న నమోదు ప్రక్రియ

కొత్తగూడెం అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులకు ప్రభుత్వ పథకాలు, బ్యాంక్ రుణాలు వంటి బృహత్తరమైన సౌకర్యాలు దరిచేరాలంటే భూధార్ ఐడీ తప్పనిసరి అని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. మనుషులకు ఆధార్ కార్డు మాదిరిగా సొంత భూములు కలిగిన రైతాంగానికి కేంద్ర ప్రభుత్వం భూధార్ సంఖ్యను కేటాయిస్తుంది. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్ చేపట్టింది. భూమి హక్కులను ధ్రువీకరించేందుకు అధీకృత రికార్డులు కలిగిన రైతులకు మాత్రమే ఈ విశిష్ట గుర్తింపు సంఖ్యను జారీ చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, రాయితీలు, బ్యాంక్ రుణాలు వంటి సౌకర్యాలకు భూధార్ తప్పనిసరి అని కేంద్రం స్పష్టం చేసింది. రాష్ట్రంలో ప్రస్తుతం రైతు వేదికల్లో, వ్యవసాయ



వ్యవసాయ పనులు చేస్తున్న కూలీలు

శాఖ కార్యాలయాల్లో, నమోదు కార్యక్రమం ఏవోల నేతృత్వంలో జోరుగా సాగుతోంది. జిల్లా రైతుల సౌలభ్యార్థం మీసేవా కేంద్రాల్లో నిర్ణీత రుసుం చెల్లించి భూధార్ ఐడీ నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. రైతుల భూముల వివరాలు పోర్టల్‌లో నమోదు చేసి భూధార్ ఐడీని కేటాయిస్తున్నారు. అయితే కౌలు రైతులు, అసైన్డ్ రైతుల పరిస్థితి ఏంటని రైతు సంఘాల నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ అగ్రిమిషన్ కార్యక్రమంలో భాగంగా రైతులందరికి విశిష్ట గుర్తింపు సంఖ్యను జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం ఆదేశాలు జారీచేసింది. ఇందులో భాగంగా సొంత భూములు కలిగిన రైతుల వివరాలను పోర్టల్ నమోదు చేయాలని వ్యవసాయశాఖ కమిషనర్ డా.గోపి అన్ని జిల్లాలకు ఉత్తర్వులు జారీచేశారు. మే నెలలో నిర్వహించిన వీసీలో వ్యవసాయశాఖ జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు. వ్యవసాయశాఖ కార్యాలయాల్లో ఈ నమోదు ప్రక్రియను ప్రత్యేకంగా రూపొందించిన తెలంగాణ ప్రభుత్వం ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో వివరాలను నిక్షిప్తం చేస్తున్నారు. రైతులు వ్యవసాయ శాఖ ఏవోల వద్దకు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్ లేదా అడంగల్ పహాణీ, ఆధార్ లింక్ అయిన మొబైల్ ఫోన్ తీసుకెళ్లాలి. పోర్టల్, రికార్డ్స్ ఆఫ్ రైట్స్, పట్టాదారు పాస్ పుస్తకాల ఆధారంగా రైతుల యాజమాన్య హక్కులను నిర్ధారించి 14 అంకెల విశిష్ట సంఖ్యను కేటాయిస్తారు. ఈ ప్రక్రియను వ్యవసాయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం కేటాయించే భూధార్ ఐడీ నెంబర్ ఆధారంగా కేంద్ర ప్రభుత్వ పథకాలైన పీఎం కిసాన్ యోజన, బీమా, ఈజీఎస్ పనులు, మొక్కల పెంపకం మంజూరు చేయనున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అయిన రైతు భరోసా, రుణమాఫీ, తదితర పథాకాలకు ఫార్మర్ రిజిస్ట్రీకి ఏ రకమైన సంబంధం లేదని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 3,65,000 ఎకరాల రెవెన్యూ భూమిలో వ్యవసాయ పంటలను సాగుచేస్తున్న 1,22,000మంది



పెద్దిరెడ్డిగూడెం రైతువేదికలో ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకుంటున్న రైతులు

రైతుల వివరాలను పరిశీలించి భూధార్ ఐడీ నెంబర్ కేటాయించనున్నారు. బుధవారం నాటికి సుమారు 20వేల మంది రైతుల వరకు నమోదు చేసుకున్నారు. సుదూర ప్రాంత రైతులు పేర్లు నమోదు చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో రెవెన్యూ రికార్డుల్లో మ్యాపింగ్ కాని భూములు, రెండు పాస్ పుస్తకాలు కలిగిన రైతులు, ఇతర రాష్ట్రాలకు చెందిన రైతులకు భూధార్ ఐడీ నెంబర్ కేటాయింపు ప్రక్రియను నమోదు చేయడం లేదని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో కౌలు రైతులతో పాటు అసైన్డ్, దేవాదాయ భూములు, అటవీ భూములు సాగుచేసుకునే చాలామంది రైతులకు నేరుగా యాజమాన్య హక్కులు లేవని, వీరందరి సమస్యలను ప్రభుత్వం ఎలా పరిష్కరిస్తుందని రైతు సంఘాలకు చెందిన నాయకులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. అయితే విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇచ్చే ప్రక్రియను ఈనెల లోగా పూర్తి చేస్తామని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

విపత్తుల వేళ అప్రమత్తంగా ఉండాలి

- 300మంది వలంటీర్లకు ఆపద మిత్ర శిక్షణ
- ప్రమాదాల సమాచారం కోసం కలెక్టరేట్‌లో 1077 కంట్రోల్ రూమ్
- జిల్లా అధికారులు, ఆపద మిత్రలతో కలెక్టర్ సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, మే 30 (ఆంధ్రజ్యోతి): విపత్తుల వేళ అప్రమత్తంగా ఉండాలి... ప్రణాళిక ప్రకారం పని చేస్తేనే ప్రజలు నష్టపోకుండా ఉంటారని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, ఆపద మిత్రలకు విపత్తుల నిర్వహణపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది ఆగస్టు 29నుంచి సెప్టెంబర్ ఒకటి వరకు వచ్చిన వరదల కారణంగా నగరం ఆపదలో చిక్కుకుందని, జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సమయస్ఫూర్తిగా పని చేయడంతో అతి తక్కువ ప్రాణనష్టంతో బయటపడ్డట్లు తెలిపారు. 15 రోజుల వ్యవధిలో సాధారణ పరిస్థితులను పునఃరుద్ధరించ గలిగామన్నారు. మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో కురిసే వర్షం వివరాలను కూడా ప్రస్తుతం ట్రాక్ చేస్తున్నామని, వరదల సమయంలో గ్రామం నుంచి జిల్లా వరకు వివిధ స్థాయిల్లో వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారం అందిస్తామన్నారు.

-జిల్లాలో ప్రమాదాల సమాచారం కోసం కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నెంబర్ 1077కు అందిన వెంటనే విపత్కర పరిస్థితులపై సంబంధిత ప్రాంతాలకు సమాచారం అందుతుందని, అక్కడ రెస్క్యూ బృందాలతో పాటు ఆపద మిత్ర శిక్షణ పొందిన వలంటీర్లు వెళ్లి విధులు నిర్వహిస్తారని కలెక్టర్ తెలిపారు. ఆపద మిత్ర శిక్షణ పొందిన వలంటీర్లు ముందుగా వారి పరిధిలోని వల్నరబుల్ ప్రాంతాలు, శిథిలావస్థకు ఉన్న ఇండ్లు, ఒంటరి మహిళలు, వృద్ధులు, వివిధ బలహీన వర్గాల ప్రజలు ఉన్న లోతట్టు ప్రాంతాలను గుర్తించాలని కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఆపద సమయంలో ఏర్పాటు చేయాల్సిన రిలీఫ్ సెంటర్‌ను ముందస్తుగానే గుర్తిస్తున్నామని, రిలీఫ్ సెంటర్‌లో బాత్రూం మరమ్మతులు, ఇతర సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టామని, ప్రతి గ్రామంలో రిలీఫ్ సెంటర్ ఎక్కడ ఉంటుందో ఆపద మిత్రలకు అవగాహన ఉండాలన్నారు.

- 12 రోజుల్లో 300మంది వలంటీర్లకు 10 రోజులపాటు తరగతి గదులలో, 2రోజుల పాటు గ్రామానికి తీసుకుని వెళ్లి క్షేత్రస్థాయి అంశాలతో శిక్షణ అందించామని, గ్రామ మ్యాప్ తయారు చేశామన్నారు. ఈ సందర్భంగా ఆపద మిత్రలకు కలెక్టర్ మెటీరియల్ పంపిణీ చేశారు. సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య, సీపీవో శ్రీనివాస్, ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

నేడు పాల్వంచకు ఇద్దరు మంత్రుల రాక

కొత్తగూడెం, మే 30 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లాలోని పాల్వంచ ప్రాంతంలోని కిన్నెరసాని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో జరిగే కార్యక్రమానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం రానున్నారు. భట్టి విక్రమార్క హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి ఉదయం 8:45 గంటలకు బయలు దేరి 10గంటల్లోపు పాల్వంచలోని కిన్నెరసాని ప్రాంతానికి చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 1:50 గంటల్లోపు కొత్తగూడెం ఏరియా సింగరేణి జీఎం నూతన భవనాన్ని ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 2:30గంటలకు హెలీక్యాప్టర్‌లో హైదరాబాద్‌కు తరలివెళ్తారు.మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం రాత్రి పాల్వంచలోని కేటీపీఎస్ గెస్ట్‌హౌస్‌లో బసచేస్తారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పాల్వంచలోని కిన్నెరసాని ప్రాంతంలో ఉమ్మడి జిల్లా ఆదివాసీ ట్రైనింగ్ కార్యక్రమానికి హాజరవుతారు.

బీఆర్‌ఎస్‌కు భవిష్యత్ లేదు

ఎంపీ పోరిక బలరాంనాయక్



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ బలరాంనాయక్

ఇల్లెందు, మే 30 (ఆంధ్రజ్యోతి): పదేళ్లు రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిన కేసీఆర్ కుటుంబంలో కుమ్ములాటలు తారాస్థాయికి చేరాయని, బీఆర్‌ఎస్‌కు రాష్ట్రంలో భవిష్యత్ లేదని పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాంనాయక్ పేర్కొన్నారు. శుక్రవారం ఇల్లెందుకు వచ్చిన ఆయన జిల్లా మైనారిటీ సెల్ కాంగ్రెస్ నాయకులు ఎస్కే జానీ, గౌస్ నివాసంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ మూలంగా రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని ఆరోపించారు. కల్వకుంట్ల కవిత తిరుగుబాటు కేసీఆర్ కుటుంబ రాజకీయాలను బట్టబయలు చేసిందన్నారు. అవినీతి అక్రమాలు సాగించి బీఆర్‌ఎస్ పాలనలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, ఢిల్లీ నుంచి కాళేశ్వరం వరకు అనేక రకాల స్కాములు చేశారని ఎంపీ బలరాం నాయక్ ధ్వజమెత్తారు. చీలికల దిశగా సాగుతున్న బీఆర్‌ఎస్‌లో నాయకులు ఇతర పార్టీల వైపు మొగ్గుచూపుతున్నారని వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ అమలు జరుగుతాయని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని, బీఆర్‌ఎస్, బీజేపీల తప్పుడు ప్రచారాలు నమ్మవద్దన్నారు. అంతకుముందు నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు గోచికొండ శ్రీదేవి, మహేశ్, ఎస్కే గౌస్, ధన్‌రాజు, శ్రీనివాస్‌గౌడ్, లింగంపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ డీఎస్పీకి రివార్డు

ఖమ్మం ఖానాపురంహవేలీ, మే 30(ఆంధ్రజ్యోతి): ఏసీబీ డీఎస్పీ వై.రమేష్‌కు శుక్రవారం హైదరాబాద్‌లో ఏసీబీ డీజీపీ విజయకుమార్ నగదు రివార్డును అందించారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తూ ఉమ్మడి జిల్లాలో అత్యధిక అవినీతి కేసుల్లో అరెస్టులు చేసినందుకు నగదు రివార్డును అందించారు.



డీఎస్పీ రమేష్‌కు రివార్డు అందిస్తున్న ఏసీబీ డీజీపీ

కార్మికులు ఈ-శ్రమ్ ఇన్సూరెన్స్‌లో పేరు నమోదు చేసుకోవాలి

లేబర్ ఆఫీసర్ నాగరాజు



మణుగూరు టౌన్, 30 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ శ్రమ్ ఇన్సూరెన్స్ పథకంలో కార్మికులు సభ్యత్వం నమోదు చేసుకోవాలని మణుగూరు కార్మిక శాఖ సహాయ అధికారి బి.నాగరాజు ప్రకటనలో శుక్రవారం తెలిపారు. జొమాటో స్విగ్గీ, ఫ్లిప్‌కార్ట్ ఫుడ్ డోర్ డెలివరీ బాయ్స్, కొరియర్ బాయ్స్, తదితర కార్మికులు ఈ పథకంలో సభ్యత్వం తీసుకోవాలన్నారు. మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు, పినపాక, కరకగూడెం, పాల్వంచ మండలాల్లో పనిచేస్తున్న అసంఘటిత రంగ కార్మికులు ఈ పథకంలో సభ్యత్వం తీసుకునేందుకు యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్మికులు కామన్ సర్వీస్ సెంటర్‌లో లేదా మీ సేవ సెంటర్లో ఆధార్ కార్డు బ్యాంకు అకౌంట్, ఫోన్ నెంబర్లతో పేరు నమోదు చేసుకోవాలన్నారు. 18 ఏళ్ల నుంచి 59 సంవత్సరాల వయసులోపు వారు ఈ నెల 31వ తేదీలోగా పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు.

'సీజనల్' ముంచుకొస్తోంది!

(3వ పేజీ తరువాయి)

సీజన్‌లో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. రోగికి ప్లేట్‌లెట్స్ కౌంట్ క్షణక్షణానికి తగ్గిపోతున్న సందర్భంలో నిర్ధారణ పరీక్షలు తక్షణమే చేయాల్సి ఉంటుంది. వాటిని నిర్వహించడానికి జిల్లా ఆస్పత్రిలో ఉన్న ఈ యంత్రాలను సిద్ధం చేసి ఉంచాల్సిన బాధ్యత ఇక్కడి అధికారులపై ఉంది.

డెంగీ నిర్ధారణ పరీక్షలు..

జిల్లా జనరల్ ఆస్పత్రిలో సెంట్రల్ ల్యాబ్‌లో డెంగీ నిర్ధారణ పరీక్షలను నిర్వహించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆస్పత్రిలో ఎలీసా పరీక్షలు నిర్వహిస్తున్నా.. వాటిని ఎక్కువ మోతాదులో సిద్ధంగా ఉంచాల్సిన అవసరం ఉంది. 50వేల కిట్లు సిద్ధంగా ఉన్నట్టు చెబుతున్నారు. చికున్‌గున్యా పరీక్షలు చేసే కిట్లు మాత్రం ఇంకా అందుబాటులో లేవని తెలుస్తోంది. బయట డయాగ్నస్టిక్ కేంద్రాల్లో వీటిని నిర్వహించడం లేదు. ప్రస్తుతం ప్లేట్‌లెట్ రిచ్ కాన్సంట్రేటర్స్, ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా ద్వారానే ప్లేట్‌లెట్స్ ఎక్కిస్తున్నారు. ఈ విధానంలో చాలా తక్కువగా ప్లేట్‌లెట్ కౌంట్స్ ఎక్కడంతో పాటు చాలా జాప్యం అవుతుంటుంది. వాస్తవానికి ప్లేట్‌లెట్స్ పడిపోయే వారికి అత్యవసరంగా ప్లాస్మా ఎక్కించాల్సి ఉంటుంది. వైద్యులు, చికిత్స పరికరాలు అందుబాటులో ఉంటేనే వైద్యం అందించి ప్రాణం నిలబెట్టే అవకాశం ఉంటుంది.

అందుబాటులోలేని ప్లాస్మా కిట్లు..

ఇక సింగిల్ డోనర్ ప్లాస్మా కిట్లు జిల్లా ఆస్పత్రిలో అందుబాటులో లేవు. ఇది అందుబాటులో ఉంటే ప్రతీ సీజన్‌లోనూ డెంగీ బారిన పడిన రోగులకు ప్లాస్మా ఎక్కించి ప్రాణాలునిలబెట్టే అవకాశం ఉంటుంది. ఇది ప్రైవేటు ఆస్పత్రిలో చేయించుకోవాలంటే రూ.15వేల నుంచి రూ.20వేల వరకు వసూలు చేస్తుంటారు. డెంగీతో పాటు ఇతర జ్వరాలు వచ్చిన వారికి సాధారణంగా ప్లేట్‌లెట్స్ పడిపోతాయి. కానీ అసాధారణంగా ప్లేట్‌లెట్స్ పడిపోతే ప్లాస్మా ఎక్కించాల్సి ఉంటుంది. ఎస్‌డీపీ యంత్రం అందుబాటులో ఉంటే రోగికి కావాల్సిన రక్తదాత నుంచి నేరుగా ప్లాస్మాను తీసి తక్షణమే ఎక్కించే అవకాశం ఉంటుంది.

టీ హబ్‌లో రీఏజెంట్స్ కొరత

టీ హబ్‌తో రాష్ట్రంలోని ప్రజలకు 53 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామంటూ నాలుగేళ్ల క్రితం నాటి ప్రభుత్వం ప్రారంభించింది. వీటిపై ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. జిల్లా ఆస్పత్రిలో టీహబ్‌లో గర్భిణులకు అత్యవసరమైన థైరాయిడ్, డయాబెటిక్ తదతర పరీక్షలకు అవసరమైన బయోకెమిస్ట్రీ, రిఏజెంట్స్ (రసాయనాలు) సరఫరా కాక నెలల తరబడి మూలన పడుతోంది. దీంతో ఇటు రోగులు, అటు వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటి వరకు టీహబ్‌లో ఉచితంగా పరీక్షలు చేస్తారని ఉన్న ప్రచారంతో చైతన్యవంతులైన ప్రజలు ఇక్కడ చేయడం లేదని చెబుతుండటంతో వాదనలకు దిగుతున్నారని వైద్యులు వాపోతున్నారు. ఇక్కడి పరీక్షలను ప్రైవేటుకు ఎందుకు రాస్తున్నారంటూ గొడవ పడుతున్నారు. టీహబ్‌కు రీఏజెంట్లు రాక.. రోగులకు సమాధానం చెప్పలేక సతమతం అవుతున్నామని వైద్యులు చెబుతున్నారు. టీహబ్ సిబ్బంది మాత్రం తాము రోజు రాష్ట్ర ప్రభుత్వానికి, టీహబ్ సమన్వయకర్తలకు సమాచారాన్ని అందిస్తున్నామంటున్నారు. దీంతో ఇక్కడ నామ మాత్రపు పరీక్షలు తప్ప రోగులకు అవసరమైన పరీక్షలు జరగడం లేదని ఆరోపిస్తున్నారు. వ్యాధుల సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ఇలాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి వైద్యాధికారులు రోగులకు ఇక్కట్లు లేకుండా చూడాలని కోరుతున్నారు.

సేవలకు సిద్ధంగా ఉన్నాం..
డాక్టర్ కిరణ్‌కుమార్,
జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

సీజనల్ వ్యాధుల బారిన పడిన ప్రజలకు సేవలిందచేందుకు సిద్ధంగా ఉన్నాం. ఆస్పత్రిలో అన్ని విభాగాలను సిద్ధంగా ఉంచాం. కొవిడ్ పరీక్షలకు ర్యాపిడ్ పరీక్షలు నిర్వహిస్తాం. డెంగీ, మలేరియా ఇతర వ్యాధుల నిర్ధారణ కిట్లు కూడా అందుబాటులో ఉన్నాయి. ఆస్పత్రిలో వార్డులను కూడా సీజన్‌కు తగినట్టు సిద్ధం చేస్తున్నాం.

బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేయాలి

- మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి
- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి విమలక్క

గుండాల, మే 30(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసీలపై జరుగుతున్న బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేసి సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జీతో విచారణ జరపాలని, సీజ్‌ఫైర్ ప్రకటించి మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి విమలక్క అన్నారు. ఆపరేషన్ కగార్‌కు నిరసనగా భారత రైతుకూలి సంఘం, ఆల్ ఇండియా కేత్ మజ్దూర్ కిసాన్ సభ, తుడుందెబ్బ, ఆధ్వర్యంలో శుక్రవారం గుండాల మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అడవుల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకే కగార్ పేరిట మారణహోమానిక పూనుకున్నారని, మావోయిస్టులు స్వచ్ఛంద కల్పుల విరమణ ప్రకటించినా సైనిక బలగాలను అడవుల్లోకి పంపి అమాయక ఆదివాసీలను కాల్చి చంపుతూ బూటకపు ఎన్‌కౌంటర్లుగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. మాడ్ గుట్టల వద్ద మావోయిస్టు జాతీయ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు 26మందిని బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చిచంపారని, మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించకుండా దహనం చేయడం అప్రజాస్వామికమన్నారు. ఆపరేషన్ కగార్ పేరిట జరిగిన ఎన్‌కౌంటర్లపై విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే కగార్ నిలిపివేసి సమస్యల పరిష్కారానికి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిద సంఘాలు, పార్టీల నాయకులు ప్రసాద్, ఉక్లా నాయక్, నాగిరెడ్డి, వెల్తూరు సదానందం, కొడెం వెంకటేశ్వర్లు, కందకట్ల సురేందర్, సోమన్న, బొమ్మెర రాంబాబు, చంద్రయ్య దొర, మోకాళ్ల సమ్మయ్య, ఆరెల్లి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విమలక్క

పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీలోకి ముగ్గురు..

ఖమ్మం, మే 30 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాజకీయ వ్యవహారాల కమిటీలో జిల్లాకు అధిక ప్రాధాన్యం దక్కింది. రాజకీయ వ్యవహారాల కమిటీతోపాటు పలు కమిటీలను ఏఐసీసీ ప్రకటించగా.. ఆయా కమిటీల్లో అనుభవం, సామాజిక సమీకరణలు బేరీజు వేసుకుంటూ సీనియర్లతోపాటు కొత్తవారికి కూడా అవకాశాలు కల్పించారు. ఈ నేపథ్యంలోనే పలువురు మంత్రులు, ఎంపీలకు, మాజీ మంత్రులకు స్థానం కల్పించారు. రాజకీయ వ్యవహారాల కమిటీలో ఖమ్మం జిల్లాకు చెందిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి, రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి స్థానం లభించింది. పార్టీ కార్యాచరణ, నియామక పదవుల విషయంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల కమిటీ అభిప్రాయాలు, నిర్ణయాలకు ప్రాధాన్యం ఉండనుంది. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థిత్వాల కేటాయింపులతో పాటు పార్టీ బలోపేతానికి అవసరమైన నిర్ణయాలను కూడా వ్యవహారాల కమిటీ చర్చిస్తుంది. సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర స్థాయిలో జరిగిన కూర్పుల్లో జిల్లా నుంచి భట్టి విక్రమార్క, రేణుకాచౌదరి, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చోటు దక్కడంతో వారి వారి వర్గీయుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఆరోగ్యానికి రక్ష.. సైకిల్ యాత్ర

- సైకిల్‌పై ప్రచారం
- అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు సురేష్



సైకిల్‌పై ప్రచారం చేస్తున్న సురేష్

కల్లూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఆరోగ్యం, సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు సైకిల్ యాత్ర చేస్తున్నారు. సైకిల్‌పై ఆరోగ్య సూత్రాల పట్టికలను ఏర్పాటు చేసుకొని గ్రామ, గ్రామాన తిరుగుతూ అవగాహన కల్పిస్తున్నారు కల్లూరు మండలంలోని పేరువంచ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు గొల్లమందల సురేష్. ఆయన తలపెట్టిన ఈ సైకిల్ యాత్రను ఎస్ఐ డి. హరిత బుధవారం ప్రారంభించగా.. సమాజంలో ప్రతీ ఒక్కరు ఆరోగ్య సూత్రాలను పాటిస్తే అంటువ్యాధులు దరిదాపులకు చేరవంటూ చెబుతున్నారు. ప్రతీ పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, డెంగీ, మలేరియాతోపాటు ఇటీవల దేశంలో వ్యాపిస్తున్న కరోనా వైరస్‌లను దూరంగా ఉంచొచ్చని వివరిస్తున్నారు. 25 సంవత్సరాలుగా ఖమ్మం జిల్లాలో వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పనిచేసిన సురేష్. సామాజిక సేవల్లోనూ తనకంటూ ప్రత్యేకత చాటుకున్నారు. మద్య, ధూమపానం నిర్మూలన, హెచ్‌ఐవీ, పాలిథిన్ కవర్లు నిషేధంపై ప్రచారం చేశారు. కరోనా విజృంభణ సమయంలో రెండు సంవత్సరాల పాటు గ్రామ గ్రామాన సైకిల్‌పై తిరిగి ప్రజలకు కరోనా నిర్మూలనపై అవగాహన కల్పించారు. పాఠశాల సమయం అనంతరం, సెలవు రోజుల్లో సామాజిక సేవలో సాగుతున్నట్లు ఆయన తెలిపారు. కల్లూరు నుంచి పేరువంచలోని తాను పనిచేసే పాఠశాలకు నిత్యం సైకిల్‌పై 10కిమీటర్లు వెళుతున్నానని, పూర్తి ఆరోగ్యంగా ఉన్నానని వెల్లడించారు.

మురిపిస్తున్న మ్యూజియం

(3వ పేజీ తరువాయి)

మ్యూజియంలో గిరిజన సంస్కృతి సంప్రదాయాలను నేటి తరానికి తెలిసేలా అధికారులు ఏర్పాటు చేశారు. ఇందులో గిరిజనులు వినియోగించే కొమ్ము తలపాగా, వాయిద్యాలు, వేటకు వినియోగించే విల్లంబులు, గిరిజనులు తయారు చేసిన అల్లికలు, వినియోగించే ఆభరణాలు, గిరిజన వేషధారణలతో ఉన్న బొమ్మలు ప్రత్యేకంగా గదుల్లో ఏర్పాటు చేశారు.

అందుబాటులో రకరకాల వంటకాలు

వేగవంతమైన ఆధునిక యుగంలో ఏజెన్సీలో రుచికరమైన వంటకాలను సందర్శకులకు అందిస్తుండటంతో అవి వారికి నోరూరిస్తున్నాయి. రాగి, జొన్న జావ, రాగి జొన్న లడ్డూలు, నువ్వుల లడ్డూలు, రాగి, జొన్న బిస్కెట్లు, రాగి జొన్న సంకటి, గటక అన్నం, కర కొమ్ములతో కూర(క్యాబేజీ తరహాలో) పచ్చకూర, బొద్దుకూర, చెంచలకూరలతో వివిధ రకాల వంటకాలను రోజు విడిచి రోజు మారుస్తూ సందర్శకులకు పసందైన వంటకాలను విక్రయిస్తున్నారు.

కేంద్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన మంత్రి సీతక్క

ఇటీవల గిరిజన మ్యూజియాన్ని సందర్శించిన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఎంతో ఆనందించి ఇందుకు కృషి చేసిన ఐటీడీఏ పీవో బి.రాహుల్‌ను అభినందించారు. అంతేకాదు హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన వర్క్‌షాపులో ఈ విషయమై ప్రత్యేకంగా ప్రస్తావించారు. భద్రాచలంలో గిరిజన మ్యూజియం నిర్వహణ బాగుందని ఆమె ప్రత్యేకంగా మరోసారి అభినందించారు. ఇదే సమయంలో కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ భద్రాచలంలో గిరిజన మ్యూజియం అభివృద్ధిని ఏ విధంగా చేసింది వారికి వివరించారు. మరో రూ.కోటి మ్యూజియం అభివృద్ధికి అవసరం ఉంటుందని ఇందుకోసం తాము ప్రతిపాదనలు పంపడం జరిగిందని పీవో వారి దృష్టికి తీసుకుచ్చారు. దీంతో సానుకూలంగా స్పందించిన కేంద్ర ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు రూ.కోటి మంజూరు చేస్తామంటూ ప్రకటించారు. ఈ విషయాన్ని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ శుక్రవారం వెల్లడించారు.



ఇటీవల మ్యూజియాన్ని సందర్శించిన మంత్రి సీతక్క

మొత్తం మింగేశారు!

(3వ పేజీ తరువాయి)

ఒకరిపై ఒకరు నెట్టేసుకుంటూ.. పొంతన లేని సమాధానాలు ఇవ్వడం గమనార్హం.

అధికారులు ఏమన్నారంటే..

ఆర్అండ్‌బీ డీఈ సతీష్ దీనిపై స్పందిస్తూ మర్కోడు గ్రామంలో ఎంపీపీఎస్ పాఠశాల అభివృద్ధి పనుల నిధులకు సంబంధించిన విషయం తమకు తెలియదని గతంలో పనిచేసిన అధికారులకు తెలిసి ఉంటుంన్నారు. ఇక మర్కోడు గ్రామ పంచాయతీ కార్యదర్శి పుష్పరాజ్ స్పందిస్తూ ఎంపీపీఎస్ పాఠశాల నిధుల విషయంలో ఆర్అండ్‌బీ అధికారులు ఇచ్చిన ఎఫ్‌టీవో, క్లియరెన్స్ లేఖ ద్వారా పంచాయతీ నుంచి తీర్మానం ఆధారంగా పనులు చేసిన వ్యక్తికి చెక్ జారిచేయడం జరిగిందన్నారు. ఈ విషయమై ఆళ్లపల్లి ఎంఈవో శాంతరావు మాట్లాడుతూ మర్కోడు ఎంపీపీఎస్ పాఠశాల ప్రహరీ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయని, వంటగది కోసం పునాదులు తీశారని, మరుగుదొడ్ల పనులు ఇంకా ప్రారంభించలేదన్నారు.

ఊళ్లు వెలుగుతాయ్ !

- నక్సల్స్ ఇలాఖాలో విద్యుత్ కాంతులు
- పూవర్తిలో ఇప్పటికే ప్రతీ ఇంటికీ విద్యుత్ కనెక్షన్
- స్వాతంత్ర్యం వచ్చిన 78ఏళ్ల తర్వాత లైన్ల ఏర్పాటు
- సుకుమా, బీజాపూర్ అడవుల్లో నిర్మాణం
- రేపటి నుంచి సరఫరా.. ఆదివాసీల్లో ఆనందం
- గతంలో సోలార్, నెగడుతో సాగిన జీవనం

చర్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): అవి తెలంగాణ రాష్ట్ర సరిహద్దునున్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా జిల్లాలు. రెండు జిల్లాల్లో మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉంది. అనేక గ్రామాలకు నేటికీ విద్యుత్ సరఫరా లేదు. అక్కడి ఆదివాసీలు సోలార్ మీదనే ఆధారపడుతున్నారు. సోలార్ కూడా లేని వారు ఇంట్లో నెగడు పెట్టుకుని జీవిస్తున్నారు. నేడు యాంటీ నక్సల్ ఆపరేషన్‌లో భాగంగా ఆయా జిల్లాలోని గ్రామాలకు విద్యుత్ లైన్లను నిర్మిస్తున్నారు. ఇప్పటికే 90శాతం పనులు పూర్తయ్యాయి. స్వాతంత్రం వచ్చిన 78 సంవ్సరాల తరువాత మావోయిస్టుల ఇలాఖాలోని గ్రామాల్లో విద్యుత్ వెలుగు వస్తుండడంతో స్థానిక ఆదివాసీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు రోడ్లను నిర్మిస్తున్నారు. మొబైల్ టవర్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.

నక్సల్ అడ్డాలో విద్యుత్ లైన్లు

బీజాపూర్, సుకుమా జిల్లాల్లోని గుండం, చుత్వాయి, కొండపల్లి, జీడిపల్లి, ధర్మారం, పూజారి కాంకేర్, గ్రామాల్లోని గ్రామాలు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు. గత కొన్ని నెలల వరకు అటుగా వెళ్లాలన్నా భయపడే వారు. ప్రస్తుతం ఈ గ్రామాల్లో విద్యుత్ లైన్లను ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నిర్మిస్తోంది. ప్రతీ ఇంటికీ కరెంట్ అందించాలనే లక్ష్యంతో పనులు ప్రారంభించింది. రెండు జిల్లాల్లో సుమారు 100 కిలోమీటర్ల మేర 2500 విద్యుత్ స్తంభాలను వేశారు. సుమారు 60 పైగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. సుమారు 1300 కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్లు పెట్టారు. జూన్ 1నుంచి ఇళ్లకు విద్యుత్ సరఫరా చేయనున్నారు. విద్యుత్ వస్తే టీవీలు కొంటామని అక్కడి వారు చెబుతున్నారు.

గతంలో విద్యుత్ లైన్లు పేల్చివేత

గతంలో కొన్ని బీజాపూర్, సుకుమా జిల్లాల్లోని కొన్ని గ్రామాలకు విద్యుత్ లైన్లు ఉండేవి. మావోయిస్టు పార్టీ ఏర్పడక ముందు సాయుధ దళాలు అయా గ్రామాలకు ఉన్న విద్యుత్ స్తంభాలను పేల్చి వేశారు. అప్పటి నుంచి మావోయిస్టుల సంఖ్య, కార్యకలాపాలు పెరగడంతో విద్యుత్‌ని మళ్ళీ పునరుద్ధరణ చెయ్యలేదు అప్పటి నుంచి గ్రామాల్లో చీకట్లు అలుము కున్నాయి. అలాగే ఈ గ్రామాలకు చెందిన ఆదివాసీలు విద్యుత్ సైకర్యం కోసం సోలార్ ప్లేట్లను వాడేవారు. అక్కడి ప్రభుత్వం కూడా వారికి సబ్సిడీ మీద అందించింది.

నెగడు కాంతిలో ఇళ్లు

సోలార్ ప్లేట్లు లేని ఆదివాసీలకు అక్కడి ప్రభుత్వం కిరోసిన్ అందించేది. నేడు కిరోసిన సరఫరా కూడా నిలిచి పోవడంతో ఆదివాసీలు ఇళ్ల ముందు నెగడు(ఇళ్ల ముందు మంట) పెట్టుకునే వారు. ఆ మంట నుంచి వచ్చే వెలుగుల్లో కాలం వెళ్లదీసే వారు. అక్కడే కూర్చుని భోజనాలు చేసే వారు. ఇలా చాలా కాలంగా విద్యుత్ లేక పోవడంతో ఆదివాసీలు ఇబ్బంది పడ్డారు. నేడు విద్యుత్ వల్ల ఉపయోగాలను అక్కడి ఆదివాసీలకు బలగాలు తెలియజేస్తున్నాయి. మావోయిస్టు పార్టీ నాయకులు హిడ్మా సొంత ఊరు పూవర్తి గ్రామంలో ఇప్పటికే విద్యుత్ అందించి ప్రతీ కుటుంబానికి బలగాలు టీవీలు అందజేశారు.



బీజాపూర్ జిల్లాలో విద్యుత్ లైన్

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య

చింతకాని/ పాల్వంచ, మే 30(ఆంధ్రజ్యోతి): చింతకాని, పాల్వంచ మండలాల్లో వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు.

పురుగుల మందు సేవించి చింతకాని మండల పరిధిలోని తిమ్మినేనిపాలెం గ్రామానికి చెందిన తుడుం రవి(55) శుక్రవారం మృతిచెందాడు. మృతుడు రెండు సంవత్సరాలుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. మనోవేదనతో గురువారం ఇంట్లో ఉన్న పురుగుల మందు సేవించడంతో కుటుంబీకులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉరేసుకుని చింతకాని మండల పరిధిలోని పొద్దుటూరు గ్రామానికి చెందిన తుడుం యల్లేష్(33) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఓ వివాదానికి సంబంధించి గత కొంత కాలంగా మనోవేదనకు గురైన యల్లేష్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై పాల్వంచ టౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. హమాలీకాలనీకి చెందిన సమ్ము బిక్షపతి(57) గతంలో స్థానికంగా హమాలీ పని చేస్తూ జీవనం సాగించేవాడు. 10 సంవత్సరాల క్రితం పక్షవాతానికి గురై ఇంట్లోనే ఉంటూ మందులు వాడుతున్నాడు. ఈ క్రమంలో అతని భార్య సమ్ము స్వరూప శుక్రవారం ఉదయం కూలిపని కోసం బయటకు వెళ్లిన సమయంలో ఉరి వేసుకున్నాడు. భార్త వచ్చి చూసేసరికి మృతిచెందాడు. కాగా తన భర్త పక్షవాతంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడని స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్ఐ సుమన్ తెలిపారు.

12 మంది మైనర్ డ్రైవర్లకు జరిమానా

ఖమ్మం ఖానాపురం హవేలి, మే 30(ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపిన 12 మంది మైనర్లకు ఒక్కొక్కరికి రూ.200 జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెల్లడించిందని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. ఇటీవల నగరంలో వాహనా తనిఖీలు నిర్వహించగా వాహనాలు నడుపుతూ పట్టుబడిన మైనర్లపై కేసులు నమోదు చేశారు. న్యాయస్థానం ఎదుట హాజరుపరుచగా మొదటి అడిషనల్ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బి. రజిని జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు తెలిపారు. మైనర్ డ్రైవింగ్ తనిఖీలపై ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందని తెలిపారు. మైనర్లు ఎవరూ కూడా వాహనాలు నడపవద్దని, పట్టుబడితే శిక్షలు తప్పవని అన్నారు.

'నకిలీ'లపై ఉక్కుపాదం

- నిషేధిత పత్తి విత్తనాల పట్టివేత
- ఆంధ్రా నుంచి తెచ్చినట్లు గుర్తింపు
- టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో ఏన్కూరు మండలంలో 564కిలోలు స్వాధీనం
- 11 మందిపై కేసు.. 9 మంది అరెస్టు
- ఖమ్మం సీపీ సునీల్‌దత్

ఏన్కూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేని.. నిషేధిత పత్తి విత్తనాలను ఏపీ నుంచి తీసుకువచ్చి తెలంగాణలోని సరిహద్దు అయిన ఖమ్మం జిల్లాలోని ఏన్కూరు తదితర మండలాల్లో విక్రయిస్తున్న వారిని టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. రూ.15లక్షల విలువైన 564 కిలోల నకిలీ, నిషేధిత పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకుని 11మందిపై కేసు నమోదు చేశారు. తొమ్మిది మందిని అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్ దత్ శుక్రవారం ఏన్కూరులో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

ఏన్కూరు పోలీసుస్టేషన్ పరిధిలోని మూడు టాస్క్‌ఫోర్సు బృందాలు నకిలీ విత్తనాల నియంత్రణకు గాను బుధవారం నుంచి తనిఖీలు చేస్తున్నాయి. ఏన్కూరు మండలంలోని రేపల్లెవాడ గ్రామశివారులో నిషేధిత విత్తనాలను అమ్ముతున్నారని తెలియడంతో పోలీసులు అక్కడ తనిఖీలు చేశా రు. మూడు రోజుల్లో పలువురి నుంచి నకిలీ విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు.

వెనిగండ్ల శ్రీహరిరావు అనే వ్యక్తి వ్యవసాయభూమిలో దాచి ఉంచిన 210కిలోల విత్తనాలను గుర్తించారు. పోలీసులు మరింత లోతుగా విచారించగా ఉమ్మినేని నరేష్ అనే వ్యక్తి ఇంటి వద్ద 120కిలోలు లభ్యమయ్యాయి. విత్తన తయారీకి వినియోగిస్తున్న రైజోబిన్ కెమికల్‌తో పాటు వేయింగ్‌మిషన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

నకిలీ విత్తనాలు అమ్ముతున్న శ్రీహరిరావు.. బాపట్ల జిల్లాలోని తన బంధువైన లక్ష్మీనారాయణ ద్వారా కిలో రూ.800 చొప్పున విత్తన ప్యాకెట్లు తెచ్చి.. ఏన్కూరు మండలంలో కిలో రూ.2600లకు విక్రయిస్తున్నాడు. ఏన్కూరు మండలంలో పోలేటి కోటేశ్వరరావు వద్ద 20నకిలీ విత్తన ప్యాకెట్లు దొరకగా.. ఏపీలోని తెనాలి ప్రాంతంనుంచి తెచ్చినట్లు తెలిసింది. ఏన్కూరుకు చెందిన గాజుల నరసింహారావు వద్ద 450 గ్రాముల విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. ఏపీలోని మైలవరం మండలం చంద్రగూడెం గ్రామానికి చెందిన శాలివాహన అనేవ్యక్తి వద్దనుంచి ప్యాకెట్ రూ.400కొనుగోలు చేసి రూ.1200లకు విక్రయించాడు. ఆయన ఇంటివద్దే నకిలీ విత్తన ప్యాకెట్ల తయారీ కుటీర పరిశ్రమ ఏర్పాటుచేసి విక్రయించినట్టు గుర్తించారు. అతని వద్ద క్వింటా రైజోబిన్ మిశ్రమం, విత్తనాలతోపాటు అరుణోదయ లేబుల్‌తో ఉన్న 272 పత్తి విత్తన ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో వెనిగళ్ల శ్రీహరిరావు, ఉమ్మినేని నరేష్, అన్నం లక్ష్మీనారాయణ, గుగులోత్ గోపి, వరదబోయిన రమేష్, తంబళ్ల నవీన్, దొంతబోయిన రమేష్, గాజుల నరసింహారావు, చర్లపల్లి శాలివాహన ఉండగా.. వెనిగళ్ల రవి, పోలేటీ కోటేశ్వరరావు పరారీలో ఉన్నట్టు సీపీ తెలిపారు. ఈ కేసులో కృషి చేసిన ఎస్ఐలు రఫీ, హరితతోపాటు మరో ఎనిమిది మంది పోలీసులకు సీపీ క్యాష్ అవార్డును అందజేశారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీపీ సునీల్‌దత్

బీటీ-3 విత్తనాల పట్టివేత



పట్టుబడిన నిషేధిత పత్తి విత్తనాల ప్యాకెట్లు

మధిరరూరల్, మే30 (ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లి గ్రామంలో నిషేధిత బీటీ-3 పత్తి విత్తనాల ప్యాకెట్లను, అనుమతి లేని రూ.65వేల విలువైన పురుగులమందులను అధికారులు పట్టుకున్నారు. వ్యవసాయాధికారి సాయి దీక్షిత్ తెలిపిన వివరాల ప్రకారం.. మడుపల్లిలో పారా రామస్వామి అనే వ్యక్తి ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ వ్యక్తి పత్తి విత్తన ప్యాకెట్లను, పురుగుల మందులను అమ్ముతున్నాడు. టాస్కుఫోర్సు బృందం అధికారులు మధిరటౌన్ సీఐ రమేస్, ఏవో సాయిదీక్షిత్, రూరల్ ఎస్ఐ లక్ష్మీ భార్గవి రామస్వామి ఇంటిపై దాడిచేశారు. దీనిని సంబంధం ఉన్న రామస్వామి, పాపిరెడ్డిపై కేసు నమోదుచేసి అరెస్టు చేశారు.



అనుమతి లేని పురుగుల మందులు

గంజాయి చాక్లెట్ల పట్టివేత

ముదిగొండ, మే 30 (ఆంధ్రజ్యోతి): ముదిగొండలోని పారిశ్రామిక ప్రాంతంలో శుక్రవారం గంజాయి చాక్లెట్లను పోలీసులు పట్టుకున్నారు. పారిశ్రామిక ప్రాంతంలో సత్యనారాయణ అనే వ్యాపారి ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వ్యక్తుల వద్ద చాక్లెట్లను కొనుగోలు స్థానిక కార్మికులకు అమ్ముతుండగా పెట్రోలింగ్ సమయంలో పోలీసులు పట్టుకున్నారు. రూ.15 వేల విలువైన 280 గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. వ్యాపారితోపాటు కొనుగోలు చేసిన, అమ్మిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఓ.మురళీ తెలిపారు. ఈ దాడిలో ట్రెయినీ ఎస్ఐ హరిత, సిబ్బంది పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

చింతకాని, మే 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన వివాహితుడు లైంగికంగా వేధిస్తుండటంతో బాలిక తల్లి శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాల్వంచలో చోరీ

పాల్వంచ, మే30 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ వనమాకాలనీలో శుక్రవారం చోరీ జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వనమాకాలనీలోని గణపతి ఇంట్లోకి దొంగలు చొరబడి కిటికీ చువ్వలు కోసి లోపలి గదిలోకి ప్రవేశించారు. బీరువాలో దాచిన బంగారు, వెండి ఆభరణాలు, నగదును దొంగిలించారు. యజమాని ఐదు రోజుల క్రితం కుటుంబంతో కలిసి ఊరు వెళ్లి తిరిగి శుక్రవారం సాయంత్రం వచ్చాడు. బీరువా తెరిచి ఉండటం, కిటికీ చువ్వలు కట్ చేసి ఉండటం, బీరువాలోని విలువైన వస్తువులు లేకపోవడంతో దొంగలు పడ్డట్లు నిర్ధారణకు వచ్చాడు. పోలీసులకు ఫిర్యాదు చేసాడు. పోలీసులు క్లూస్ టీం సహాయంతో రంగంలోకి దిగి విచారణ ప్రారంభించారు.



వంతెనపై ప్రమాదంతో స్తంభించిన ట్రాఫిక్



రెయిలింగ్‌ను ఢీకొని రోడ్డుపైనే నిలిచిన కొబ్బరి బొండాల వ్యాన్

చెత్తకుప్పే కాపాడింది !

- ఎదురుగా వచ్చిన డీసీఎం, కారును ఢీ కొట్టిన లారీ
- 50అడుగుల లోతులో ఉన్న నదిలోకి లారీ, కారు పల్టీ
- ప్రాణాలతో బయటపడ్డ ఐదుగురు

వైరా, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం జిల్లా వైరాకు సమీపంలో జాతీయ ప్రధాన రహదారిలో ఉన్న వైరా నది హైలెవల్ వంతెన వద్ద శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కొబ్బరి కాయల లోడుతో వెళుతున్న డీసీఎం, ఓ కారును.. ఇనుపచువ్వలతో వెళుతున్న లారీ ఢీ కొట్టింది. దీంతో ఇనుపచువ్వల లారీ, కారు వంతెనపై నుంచి 50అడుగుల లోతులో ఉన్న నదిలోకి పల్టీకొట్టాయి. ఈ క్రమంలో కారుపై ఇనుపచువ్వలు కూడా పడ్డాయి. అలాగే ఈ ప్రమాదంలో కొబ్బరికాయల లోడ్‌తో ఉన్న డీసీఎం కూడా ధ్వంసమైంది. ఊహించుకుంటేనే భయానకంగా ఉన్న ఈ ప్రమాదంలో ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఇద్దరికి తీవ్రగాయాలు కాగా ఐదుగురికి స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన తీరును చేస్తూ ఆ వాహనాల్లోని వారు ఎవరూ బతికి ఉండటానికి అవకాశమే లేదన్నట్లుగా ఉందని స్థానికులు చర్చించుకుంటున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లో హయత్‌నగర్‌లో నివాసం ఉంటున్న మొగిలిశెట్టి రాజశేఖర్, గీత దంపతులు, వారి కుమారుడు తేజస్, కుమార్తె జ్యోతి, రాజశేఖర్ తండ్రి కోటేశ్వరరావు కారులో కృష్ణా జిల్లా తిరువూరు నుంచి వైరా మండలం రెబ్బవరంలోని గీత పుట్టింటికి వస్తున్నారు. అదే సమయంలో తల్లాడ వైపు నుంచి కొబ్బరి బొండాల లోడ్‌తో వైరా వస్తున్న డీసీఎం వ్యాన్‌ను.. ఖమ్మం వైపు ఉంచి తల్లాడ వైపు వెళుతున్న 20ఎంఎం ఐరన్ చువ్వల లోడ్‌తో లారీ ఎదురుగా ఢీ కొట్టింది. ఆ వెంటనే రాజశేఖర్ కుటుంబం ప్రయాణిస్తున్న కారును ఢీ కొంది. అయితే డీసీఎం వ్యాను వంతెన రెయిలింగ్‌కు తగిలి నదిలో పడిపోకుండా ఆగింది. కానీ వాహనం పూర్తిగా ధ్వంసమై.. కొబ్బరికాయలు రోడ్డుపై చిందరవందరగా పడ్డాయి. ఇక రాజశేఖర్ కుటుంబం ప్రయాణిస్తున్న కారు, దాని వెనుకే ఇనుప చువ్వల లోడ్ లారీ రెండూ 50అడుగుల లోతులో ఉన్న వైరా నదిలో పల్టీ కొట్టాయి. అయితే వైరా నదిలో మునిసిపాలిటీ వారు డంప్ చేసిన చెత్తపై కారు పడిపోగా.. లారీలోని టన్నుల కొద్దీ బరువున్న ఇనుప చువ్వలు కూడా కారుపై పడ్డాయి. దీంతో ఆ కారు నుజ్జునుజ్జవగా కారులోని ఎయిర్‌బ్యాగ్‌లు ఓపెన్ కావడమేకాకుండా ఇనుప చువ్వల బరువుకు కారు చెత్తలో కూరుకుపోవడంతో దానిలో ఉన్న ఐదుగురు ప్రాణాలతో బయటపడ్డారు. వారు కారు డోర్లు పగులగొట్టుకొని బయటకు వచ్చారు. ఇక లారీ డ్రైవర్ మున్నా క్యాబిన్‌లో చేయి ఇరుక్కుపోవడమేకాకుండా తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు డ్రైవర్‌ను క్యాబిన్ నుంచి బయటకు తీశారు. ఇక రాజశేఖర్, గీత దంపతులు, వారి పిల్లలు తేజస్, జ్యోతిలకు స్వల్పగాయాలవగా తండ్రి కోటేశ్వరరావుకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని చికిత్స కోసం ఖమ్మం తరలించారు. ప్రమాదానికి గురై రోడ్డుపైనే ఆగిన డీసీఎం వ్యాన్ డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. అయితే రాజశేఖర్ కుటుంబం మరో 12కిలోమీటర్లు ప్రయాణిస్తే తమ అత్తగారి గ్రామమైన రెబ్బవరం చేరుకొనేవారు. ఈలోపుగానే ఈ ప్రమాదం జరిగింది. ఇంత పెను ప్రమాదంలో వారు ప్రాణాలతో బయటపడటంతో బంధువులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాదం తర్వాత ఇరుకు వంతెన కావడంతో రెండువైపులా నాలుగైదు కిలోమీటర్ల దూరం ట్రాఫిక్ స్తంభించిపోయింది. వైరా ఎస్ఐ పి.రామారావు తమ సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. వంతెనపై ఇరుక్కుపోయిన డీసీఎం వ్యాన్‌ను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.



ప్రమాదానికి కారణమైన ఇనుపచువ్వల లారీ

అందరూ మృత్యుంజయులే

- ఐదుగురి ప్రాణాలు కాపాడిన చెత్త



గాయపడిన మొగిలిశెట్టి కోటేశ్వరరావును ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

ఖమ్మం జిల్లా వైరాకు సమీపంలోని హైలెవల్ వంతెన వద్ద శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృత్యుంజయులుగా బయటపడ్డారు. 50 అడుగుల లోతులో ఉన్న నదిలో కారు పడి.. దానిపై టన్నులకొద్దీ ఇనుప చువ్వలు పడినా.. ఆ కారు నుజ్జునుజ్జయినా ఒకే కుటుంబానికి ఐదుగురు గాయాలతో బయట పడ్డారు. వైరా నదిలో మునిసిపాలిటీ వారు పోసిన చెత్త ఈ ఐదుగురిని ప్రాణాలను కాపాడింది. లారీలోని ఇనుప చువ్వలు కారుమీద పడిన సమయంలో కారు చెత్తకుప్పలో కూరుకుపోవడంతో దానిలో ఉన్న ఐదుగురు గాయాలతో బయటకొచ్చారు. ఈ ప్రమాద దృశ్యం చూసిన వారెవరికైనా కారులోని వారు కచ్చితంగా మృతిచెంది ఉంటారనుకుంటారు. కానీ వారు మృత్యుంజయులుగా బయటపడటం వారి అదృష్టమేనని అందరూ చర్చించుకున్నారు. కారులో ఉన్న మొగిలిశెట్టి కోటేశ్వరరావుకు తీవ్రగాయాలు కాగా ఆయన కుమారుడు మొగిలిశెట్టి రాజశేఖర్, కోడలు గీత, మనవడు, మనుమరాలు తేజస్, జ్యోతి స్వల్పగాయాలతో బయటపడ్డారు. కోటేశ్వరరావును ఖమ్మం ఆస్పత్రికి తరలించగా. రాజశేఖర్, గీత దంపతులు వారి కుమారుడు, కుమార్తె తేజస్, జ్యోతి జరిగిన సంఘటనతో భీతిల్లిపోయారు. ఘటన నుంచి తేరుకోవడానికి వారికి చాలా సమయం పట్టింది.

మావోయిస్టులారా.. అజ్ఞాతం వీడండి..

- కుటుంబసభ్యులతో ప్రశాంత జీవనం గడపండి
- భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజు
- 17మంది మావోయిస్టు దళసభ్యుల లొంగుబాటు
- ఒక్కొక్కరికి రూ.25వేల ఆర్థిక సహాయం అందజేత



లొంగిపోయిన వారి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం, మే 30 (ఆంధ్రజ్యోతి): నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన అగ్రనేతలు, నాయకులు, దళసభ్యులు, క్యాడర్ అజ్ఞాతాన్ని విడిచిపెట్టి జనజీవన స్రవంతిలోకి కలిసి కుటుంబసభ్యులతో ప్రశాంత జీవనం గడపాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ పిలుపునిచ్చారు. కొత్తగూడెంలోని హేమచంద్రాపురం గ్రామంలో ఉన్న జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్‌లో శుక్రవారం ఎస్పీ రోహిత్‌రాజు సమక్షంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాకు చెందిన 17మంది మావోయిస్టు దళసభ్యులు లొంగిపోయారు. లొంగిపోయిన మావోయిస్టులకు ఆర్థిక సహాయాన్ని ఒక్కొక్కరికి రూ.25వేల చొప్పున ఎస్పీ అందజేశారు.

ఈ సందర్భంగా పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో లొంగిపోయిన మావోయిస్టుల వివరాలను ఎస్పీ రోహిత్‌రాజ్ వెల్లడించారు. లొంగిపోయిన 17మంది మావోయిస్టుల్లో ఆరుగురు మహిళ మావోయిస్టులు, 11మంది పురుష మావోయిస్టులు ఉన్నట్లు తెలిపారు. జనవరి నుంచి ఇప్పటి వరకు మొత్తం 288మంది మావోయిస్టులు వివిధ హోదాల్లో దళసభ్యులుగా ఉన్న వారు లొంగిపోయారని వివరించారు. ఈ సమావేశంలో కొత్తగూడెం అడిషనల్ ఎస్పీ (ఆపరేషన్స్) జి. నరేందర్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, 141 బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ ప్రీత, 81బెటాలియన్ అడిషన్ కమాండెంట్ రవి శర్మ, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనవాస్, చర్ల సీఐ రాజు వర్మ, ఆర్ఐ (ఆపరేషన్స్) రవి తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

పాల్వంచ, మే 30 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండలానికి చెందిన మహిళ అదృశ్యమైన ఘటనపై రూరల్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన ధర్మసోతు సుజాత తన భర్త గోపీతో తరచూ గొడవ పడుతుండేది. ఈ క్రమంలోనే గురువారం రాత్రి భార్య, భర్త ఒక చిన్న విషయంలో గొడవ పడ్డారు. ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. ఎంతకూ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికారు. ఎంతకూ ఆమె ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె తండ్రికి విషయం తెలిపారు. ఆమె తండ్రి మాలోతు మంగ్యా ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

ఆరుగురికి గాయాలు

కొణిజర్ల, మే30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తనికెళ్ల సమీపంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఆరుగురుకి తీవ్రగాయాలు అయ్యాయి. ఎస్ఐ సూరజ్ తెలిపిన వివరాలు ప్రకారం చింతలపుడి నుంచి ఖమ్మం వస్తున్న కారు ఖమ్మం నుంచి వైరా వైపు వెళ్లుతున్న లారీ.. రెండు ఓవర్‌టేక్ చేసుకుంటూ ఢీకొట్లాయి. అదే క్రమంలో కారు కొణిజర్ల నుంచి ఖమ్మం వెళ్లుతున్న ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ లారీని వదిలి పరారయ్యాడు. కారు, ఆటో రెండు దెబ్బతిన్నాయి. కారులో ఉన్న కారునడుపుతున్న కోడూరు సునీల్, కారులోని వెంకటేశ్వరరావు, పార్వతి, ఆటో నడుపుతున్న తాటి లోకేష్, ప్రయాణికులు, వెంకటేశ్వర్లు మరో వ్యక్తి ఆరుగురుకి తీవ్రగాయలు అయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనాలం ద్వారా ఖమ్మం తరలించారు. లారీ రోడ్డుపై ఆగడంలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని లారీ,కారును పక్కకు పెట్టించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. జరిగిన ప్రమాదంపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైల్వే ట్రాక్‌పై మృతదేహం లభ్యం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే30(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం రైల్వేస్టేషన్ పరిధిలోని రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని పురుషుడి మృతదేహం లభ్యమైనట్లు డోర్నకల్ జీఆర్‌పీ ఎస్ఐ సురేష్ శుక్రవారం తెలిపారు. తడకలపూడి - చీమల పహాడ్ రైల్వేస్టేషన్ మధ్యన కేఎం నెం. 35/8-9 వద్ద సింగరేణి ప్యాసింజర్ రైలు ఢీ కొట్టడంతో మృతి చెందినట్లు తెలిపారు. వయస్సు సుమారు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందని, మృతుడి ఒంటిపై తెలుపు రంగు ఫుల్ షర్ట్, బ్రౌన్ కలర్ పాయింట్, రైల్వే ట్రాక్‌పై చెత్త ఏరుకునే బస్తాలు, అందులో పనికిరాని చెత్త ఉందన్నారు. మృతుడు యాచకుని వలె ఉన్నాడని , ఇతర ఎలాంటి గుర్తింపు ఆధారాలు లేవని అన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

- 300 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం
- రెండు లీటర్ల సారా స్వాధీనం

కరకగూడెం, మే30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చొప్పాల పంచాయతీలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం మణుగూరు ఎక్సైజ్ సీఐ రాజిరెడ్డి ఆధ్వర్యంలో ముమ్మరంగా దాడులు నిర్వహించారు. పలు ఇళ్లలో డ్రమ్ములలో నిల్వ ఉంచిన సుమారు 300 లీటర్ల బెల్లం పానకంను ధ్వంసం చేసిన అధికారులు డ్రమ్ములను కాలబెట్టారు. రెండు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ రాజిరెడ్డి మాట్లాడుతూ నాటుసారా తయారు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించగా 300 లీటర్ల బెల్లం పానకం, రెండు లీటర్ల నాటుసారా దొరికాయని, నిందితులపై జూన్ 3వ తేదీన బైండోవర్ కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. నాటుసారా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాటుసారా నియంత్రనే లక్ష్యంగా ముందుకు పోతున్నట్లు పేర్కొన్నారు. దూర ప్రాంతాల నుంచి మండలానికి బెల్లం, పటిక వస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్ల శ్రీను, ఆంజనేయులు పాల్గొన్నారు.



గౌతమి జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిగా సంధ్య



నేలకొండపల్లి, మే30(ఆంధ్రజ్యోతి): గౌతమి మహిళా జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిగా నేలకొండపల్లి మదర్ థెరిస్సా మండల అధ్యక్షురాలు కుక్కల సంధ్య ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఈఎన్నిక జరిగింది. జిల్లాసమాఖ్య అధ్యక్షురాలిగా ఎన్నికైన సంధ్యను ఏపీఎం ఆర్.శ్రీనివాసరావు, సీసీ పెద్దపాక వెంకటేశ్వరరావు అభినందించారు. జిల్లా సమాఖ్య అభివృద్ధికి కృషి చేస్తానని సంధ్య చెప్పారు.



ర్యాలీలో పాల్గొన్న నాయకులు

ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు ఉద్యమించాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం
- కలెక్టరేట్ వరకు ర్యాలీ, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

ఖమ్మంసంక్షేమవిభాగం, మే30(ఆంధ్ర జ్యోతి): ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు ఉద్యమించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధి కూలీలు, శ్రామిక మహిళలు, నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా పొన్నం వెంకటేశ్వరరావు, సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల ప్రజల ఉపాధిపై తీవ్రంగా దెబ్బకొడుతోందని, రాష్ట్రప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయటంలో విఫలమైందన్నారు.రైతుకూలీలకు రూ.12వేలు అందిస్తామని నేటివరకు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. కార్పొరేట్ సంస్థలు చెల్లించలేని అప్పులను రద్దు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయటంలో మాత్రం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. నాయకులు బుగ్గవీటి సరళ, బొంతు రాంబాబు, యర్రా శ్రీనివాసరావు, తాళ్లపల్లి కృష్ణ, వత్సవాయి జానకిరాములు, కొండెబోయిన నాగేశ్వరరావు, పొన్నగంటి సంగయ్య, ప్రతాపనేని వెంకటేశ్వరరావు, కృష్ణార్జునరావు, సుదర్శన్‌రెడ్డి, గొడవర్తి నాగేశ్వరరావు, మెరుగు రమణ, ఎస్ నవీన్‌రెడ్డి, భూక్య శ్రీనివాసరావు, దొంగల తిరుపతిరావు పాల్గొన్నారు.

రాష్ట్రఅవతరణ వేడుకలను..
అట్టహాసంగా నిర్వహించాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లపై సూచనలు ఇస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంకలెక్టరేట్, మే30(ఆంధ్రజ్యోతి): జూన్ 2న జరుగనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవాలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. వాతావరణ పరిస్థితులను బట్టి తగిన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచనలు చేశారు. సౌండ్ సిస్టం ఏర్పాటు, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండాలని, వీఐపీ, ప్రజలకు, విద్యార్థులకు గ్యాలరీలు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని, ప్రోటోకాల్ ప్రకారం ప్రతీ ఒక్కరికీ తప్పనిసరిగా ఆహ్వానం అందించాలన్నారు. ముఖ్యఅతిథి గౌరవ వందనం స్వీకరణ, జాతీయ పతాకావిష్కరణ, తెలంగాణగీతం ఆలాపన, ముఖ్య అతిథి సందేశం, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కార్యక్రమాలపై శకటాల ప్రదర్శన, పిల్లలచే సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, స్టాల్స్ సందర్శన పక్కాగా ఉండాలన్నారు. ఎండ తగలకుండా పూర్తి స్థాయిలో టెంట్‌వేయాలని, ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని అన్ని గ్యాలరీలలో వేడిని తట్టుకునేలా కూలర్లు ఏర్పాటు చేయాలన్నారు. వర్షాభావ పరిస్థితులు ఉంటే అందుకు తగ్గ ముందస్తు చర్యలు తీసుకోవాలని వివరించారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ స్టాల్స్ ఏర్పాటు చేయాలని, ప్రతీశాఖకు చెందిన అధికారులు, సిబ్బంది వేడుకలకు తప్పని సరిగా హాజరు కావాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో డీఆర్వో పద్మశ్రీ, పోలీస్‌అడ్మిన్ ఆర్ఐ కామరాజు, అర్బన్ తహసీల్దార్ సైదులు, ఆర్ఐ వహీద్ పాల్గొన్నారు.

3నుంచి రెవెన్యూ సదస్సులు

తిరుమలాయపాలెం, మే30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో భూభారతిపై వచ్చేనెల 3నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ లూథర్ విల్సన్ తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. 3న కొక్కిరేణి, 4న తిరుమలాయపాలెం, 5నతాళ్లచెరువు, 6న వెదుళ్లచెరువు, 9నపిండిప్రోలు, 10నతెట్టెలపాడు, 11నతిప్పారెడ్డిగూడెం తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

అశాస్త్రీయ సర్దుబాటును సవరించాలి

ఖమ్మంఖానాపురంహవేలి,మే30(ఆంధ్రజ్యోతి):రాబోయేవిద్యా సంవత్సరానికి ఉపాధ్యాయులను సర్దుబాటు చేసేందుకు విడుదల చేసిన ఉత్తర్వులు అశాస్త్రీయంగా ఉన్నాయని వీటిని ఉపసంహరించి సవరణ ఉత్తర్వులు జారీ చేసి సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని యూటీఎఫ్ జిల్లా కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. పాథమిక పాఠశాలల్లో ఈ సర్దుబాటు ప్రక్రియ తీవ్రంగా దెబ్బతీస్తుందని ఉపాధ్యాయులు లేక విద్యార్థులలో విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయని తెలిపారు.

మట్టి అక్రమాలపై ఫిర్యాదు చేస్తే దాడి

గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి

కామేపల్లి, మే 30(ఆంధ్రజ్యోతి): గుట్టల నుంచి మట్టి అక్రమంగా తరలిస్తున్నారని తహసీల్దార్ సుధాకర్‌కు ఫిర్యాదు చేస్తే బీజేపీ నాయకుడు జాలే శ్రీనుపై దాడి చేయడం అమానుషం అని బీజేపి గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి భూక్య శ్రీను ఖండించారు. కామేపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మద్దులపల్లి, జాస్తిపల్లి అటవీ భూముల్లో అక్రమంగా కొందరు జేసీబీలు, టాక్టర్లతో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని చెప్పారు. దీనిపై బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాలే శ్రీను ఫిర్యాదు చేశాడని, ఈ నేపథ్యంలో మద్దులపల్లికి చెందిన ఓ వ్యక్తి శ్రీనుపై దాడి చేశాడని చెప్పాడు. ఇలాంటి దాడులు మానుకోవాలని హితవు పలికారు. ఈసంఘటనపై కామేపల్లి పోలీస్‌స్టేషన్‌లోఫిర్యాదు చేశారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు జర్పుల రామారావు, భాగం రంగారావు, పోలూరి రామచంద్రయ్య ఉన్నారు.

అర్హులకు ఇళ్లు

తిరుమలాయపాలెం, మే30(ఆంధ్ర జ్యోతి): అర్హులైనవారందరికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందని ఎంపీడీవో సిలార్‌సాహెబ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పాతర్లపాడు రైతు వేదికలో రెండోవిడత కార్యక్రమంపై అవగాహన కలిపించారు. మొదటి విడతలో ఇల్లు రానివారికి రెండో విడతలో దరఖాస్తుచే యాలని సూచించారు. ప్రతీ దరఖాస్తు పరిశీలించి అందరికి ఇళ్లు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో నరసింహారావు, ఎంపీవో సూర్యనారాయణ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

నేలకొండపల్లి ఎస్ఐ సంతోష్


నేలకొండపల్లిలో ఏవోతో కలిసి విత్తన దుకాణాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ, పిండిప్రోలులో

నేలకొండపల్లి, మే30(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలమ్ముతూ రైతులను మోసం చేసే విత్తన దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని నేలకొండపల్లి ఎస్ఐ పెంటరి సంతోష్ హెచ్చరించారు. శుక్రవారం మండల వ్యవసాయాధికారి ఎం.రాధతో కలిసి నేలకొండపల్లిలోని విత్తన విక్రయ దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం రైతువేదికలో విత్తన,ఎరువుల దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రైతులు తమకు కావాల్సిన ఎరువులు, విత్తనాలను ప్రభుత్వ అనుమతి ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలమ్ముతామంటూ కొత్త వ్యక్తులెవరైనా గ్రామాల్లోకి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. దుకాణదారులు ఎరువులు/విత్తనాలు అమ్మిన సమయంలో ఖచ్చితంగా బిల్లు ఇవ్వాలన్నారు. వ్యవసాయాధికారి రాధ మాట్లాడుతూ దుకాణదారులు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు తప్పక పాటించాల్సిందేనన్నారు.

తిరుమలాయపాలెం: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎరువులు, విత్తనాల దుకాణాలను శుక్రవారం ఎస్ఐజగదీష్,ఏవో సీతారాంరెడ్డి తనిఖీ చేశారు. మండలంలోని పిండిప్రోలు, దమ్మాయిగూడెం, తిరుమలాయపాలెం, గ్రామాల్లోని దుకాణాలను పరిశీలించారు. నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి డీలర్‌కూడా స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకాలు తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. రైతులకు విత్తనాలుకొనేటప్పుడు వారికి రశీదులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమలో ఏఈవోలు బాలకృష్ణనవనీత పాల్గొన్నారు.

ఫలితాలు అందేలా
100 రోజుల కార్యాచరణ

- సీడీఎంఏ కమిషనర్ శ్రీదేవి
- మునిసిపల్, మెప్మా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్


వీసీలో పాల్గొన్న కేఎంసీ అధికారులు

ఖమ్మంసంక్షేమవిభాగం,మే30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టబోతున్న 100రోజుల కార్యాచరణ కార్యక్రమం ఫలితాలు ప్రజలకు అందేలా పని తీరు ఉండాలని సీడీఎంఏ కమిషనర్ శ్రీదేవి ఆదేశించారు.శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపల్, నగర పాలక సంస్థల అధికారులు, ఉద్యోగులు, మెప్మా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పారిశుధ్య పనుల నుంచి తెలంగాణ వనమహోత్సవం వరకు క్లీయర్ కట్ ఆదేశాలు జారీ చేశారు. వర్షాలు పడకముందే ప్రధాన కాల్వల నుంచి అంతర్గత కాల్వల వరకు శుభ్రం చేయాలని ఆదేశించారు. జోన్‌లవారీగా అధికారుల నియామకం చేసి యాక్షన్‌ప్లాన్ అమలు చేయాలని సూచించారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీలు చేపట్టాలన్నారు. ప్రతి కార్యక్రమంలో మహిళా స్వయం సహాయక సంఘాలను భాగస్వామ్యం చేయాలని కమిషనర్ శ్రీదేవి ఆదేశించారు. వీధివ్యాపారులతో స్ట్రీట్‌ఫుడ్ మేళాలు, మహిళా స్వయం సహాయక సంఘాలతో ఎస్‌హెచ్‌జీ ప్రొడక్టు మేళాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వీధివ్యాపారుల సంఘాలను ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలను రెడ్‌జోన్‌గా, మార్కెట్ ప్రాంతాలను గ్రీన్ జోన్‌గా, పాఠశాలలు ఉండే ప్రాంతాలను ఆరెంజ్ జోన్‌గా విభజన చేసి ఆయా సమయాల్లోనే వ్యాపారులు జరిగేలా అధికారులు కార్యచరణ చేయాలన్నారు. ప్రకృతివిపత్తులను ముందుగానే అంచనాలు వేసి నష్టాలు జరగకుండా ఎలార్ట్‌గా ఉండాలని ఆదేశించారు. అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా, ఈఈ కృష్ణలాల్, ఉద్యాన అధికారి బెల్లం రాధిక, మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాతరాణి పాల్గొన్నారు.

గ్రానైట్, టైల్స్ ఓనర్స్ అసోసియేషన్‌కు సన్మానం


రమేష్‌ను అభినందిస్తున్న దృశ్యం

ఖమ్మంచర్చికాంపౌండ్,మే30(ఆంధ్ర జ్యోతి): ఇటీవల నూతనంగా ఏర్పడిన జిల్లా గ్రానైట్, టైల్స్ ఓనర్స్ అసోసియేషన్‌ను మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. జిల్లా గ్రానైట్ అండ్ టైల్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడుగా తెడ్డు రమేష్, ఎలక్ట్రిషియన్ యూనియన్ అధ్యక్షుడుగా ముత్యాల గోవర్ధన్‌లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈసందర్భంగా సంఘం కార్యాలయంలో మున్నూరు కాపుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ, రిటైర్డు పోలీసు అధికారి కేదాసు నరసయ్య తదితరులు సన్మానించారు.ఈ కార్యక్రమంలోకర్నాటి సోమయ్య, కొలనుపాక యుగంధర్, ప్రముఖ న్యాయవాది మూరగుండ్ల శ్రీధర్, గోగం సురేష్, ద్రాక్షపల్లి రాంచందర్, బొగ్గారపు మల్లేష్‌రావు, శ్రీకాంత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలలకే బదిలీ

ఖమ్మంసంక్షేమ విభాగం, మే30 (ఆంధ్ర జ్యోతి): అభివృద్ధి పనులు ముందుకు సాగాలంటే ఇంజనీరింగ్ అధికారులు, సాంకేతిక ఉద్యోగుల అవసరం ఎంతో ఉంటుంది. అయితే గత ఏడాదిగా ఖమ్మం నగర పాలక సంస్థకు ఇంజనీరింగ్ అధికారుల కొరత గండం ఏర్పడుతోంది. ఏడాది క్రితం కేఎంసీ పనిచేస్తున్న ఇంజనీరింగ్ అధికారులకు ఇతర ప్రాంతాలకు బదిలీ కావటంతో అభివృద్ధి పనుల పరిశీలన నుంచి కాంట్రాక్టర్లుకు బిల్లులు చెల్లింపుల వరకు జాప్యం ఏర్పడింది. తర్వాత కాలంలో కేఎంసీకి వచ్చిన ఇంజనీరింగ్ అధికారులు ఇక్కడ పనిచేసేందుకు కొంత ఇబ్బంది పడుతున్నారు. కేఎంసీలో ఉత్తమ ఇంజనీరింగ్ అధికారిగా పేరు తెచ్చుకున్న ఏఈ బాబురావును ఏదులాపురం మునిసిపాలిటీ అధికారులు పట్టుబట్టి మరీ డిప్యూటేషన్‌పై తీసుకెళ్లారు. హైదరాబాద్ నుంచి ఫిబ్రవరిలో కేఎంసీకి బదిలీపై వచ్చిన ఇంజనీరింగ్ అధికారి జ్యోతి తర్వాత రెండు నెలలు సెలవ్‌పై వెళ్లారు. ఏప్రిల్‌లో తిరిగి ఉద్యోగంలో చేరారు. ఇంజనీరింగ్ పనుల పరిశీలనలో మంచి నాణ్యతా ప్రమాణాలు పాటించారు. కానీ అనూహ్యంగా ఆమెకు శుక్రవారం పెద్ద అంబారుపేటకు బదిలీ జరిగింది. ఖమ్మం పబ్లిక్ హెల్త్‌లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అధికారి నవీన్‌కుమార్‌కు ఇన్‌చార్జీ బాధ్యతలను అప్పగించారు.

సొంత గూటికి
కేఎంసీ రెవెన్యూ ఉద్యోగులు

- జీపీవో పరీక్షల్లో 15మందికి పైగా అర్హత
- జూన్2 నుంచి పంచాయతీ ఆఫీసర్‌గా వెళ్లేందుకు సన్నద్ధం

ఖమ్మంసంక్షేమవిభాగం, మే30(ఆంధ్ర జ్యోతి): రెవెన్యూశాఖ నుంచి ఖమ్మం నగర పాలక సంస్థలో ఇప్పటి వరకు విధులు నిర్వహించిన ఉద్యోగుల్లో ఒక్కరుమినహా అందరూ తిరిగి రెవెన్యూశాఖ పరిధిలోకి వెళ్లనున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రామ పంచాయతీ ఆఫీసర్(జీపీవో) పరీక్షల్లో కేఎంసీలో రెవెన్యూశాఖ నుంచి వచ్చిన ఉద్యోగుల్లో ఒక్క ఉద్యోగి మినహా మిగిలిన 15 మంది బిల్‌కలెక్టర్లు, ఇతర ఉద్యోగులు, ఒక రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ అర్హత సాధించారు. దీంతో వారు తిరిగి పంచాయతీ ఆఫీసర్‌గా ఉద్యోగంలో చేరేందుకు సుముఖంగా ఉన్నారు. ఈ మేరకు జీపీవో పరీక్షఫలితాలు వెలువడిన నాటినుంచి రెవెన్యూశాఖలోకి వెళ్లేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఆదేశాలిస్తే జూన్ 2నుంచి గ్రామ పంచాయతీ ఆఫీసర్లుగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

6లోపు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి

ఖమ్మంఖానాపురంహవేలి మే30 (ఆంధ్ర జ్యోతి): దోస్త్ 2025 డిగ్రీ ప్రథమ సంవత్సర ప్రవేశాల్లో సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 6లోగా సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకోవాలని ఎస్ఆర్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మొహ్మద్ జాకీరుల్లా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెల్ఫ్ రిపోర్టింగ్ చేయని విద్యార్థులు సీటు కోల్పోతారని తెలిపారు. రెండో విడత ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందని దోస్త్ కోఆర్డినేటర్ ఎండి. సలీం పాషా తెలిపారు. జూన్ 9 వరకు విద్యార్థులు రెండో విడత రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చునని తెలిపారు. జూన్ 13న సీట్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు.

తప్పుడు ప్రచారాలు చేస్తున్న వ్యక్తిపై ఫిర్యాదు

ఖమ్మంఖానాపురంహవేలి, మే30(ఆంధ్ర జ్యోతి):ఓయూట్యూబ్ చానల్ ద్వారా మహ్మద్ ప్రవక్తపై తప్పుడు ప్రచారాలు చేస్తూ,మతవిద్వేషాలు రెచ్చగొడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పబ్లిక్ ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర సమన్వయకర్త అబ్దుల్ రహిమాన్ ఖమ్మం ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుట్రపూరితంగా హైదరాబాద్‌కు చెందిన ప్రవీణ్ తన యూట్యూబ్ ఛానల్ ద్వారా తప్పుడు ప్రచారాలు చేస్తున్నాడని పేర్కొన్నాడు. అతనిపై చర్య తీసుకోవాలని ఇన్స్‌పెక్టర్ కరుణాకర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో కోరారు. ఈ కార్యక్రమంలో అఫ్జల్, రహమాన్, టిప్పు. సుల్తాన్, ఖిజారుల్లా, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తాగుతున్న ఇద్దరి అరెస్టు

ఖమ్మంఖానాపురంహవేలి,మే30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మమతా రోడ్డులో శుక్రవారం పోలీసుల తనిఖీల్లో గంజాయి తాగుతున్న ఇద్దరు వ్యక్తులను ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం తనిఖీల్లో భాగంగా మమతా రోడ్డులో ఇద్దరు పట్టుబడగా వారిని పరీక్షించగా గంజాయి తాగినట్లు నిర్ధారణ అయిందని ఇన్స్‌పెక్టర్ కరుణాకర్ తెలిపారు. మత్తుపదార్థాలు సరఫరా చేసినా, తాగినా చర్యలు తప్పవన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న హనుమంతరావు, దీప్లానాయక్

రఘునాథపాలెం, మే30(ఆంధ్ర జ్యోతి): మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో రాష్ట్రంలోనే అత్యధికంగా ఖమ్మం నియోజకవర్గంలోని బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సహాయం మంజూరు జరుగుతుందని ఖమ్మం ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, మండల కాంగ్రెస్ కన్వీనర్ వాంకుడోత్ దీప్లానాయక్ పేర్కొన్నారు. మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రఘునాథపాలెం మండలంలో బాధితుల ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, రెంటాల ప్రసాద్, బండి నాగేశ్వరరావు, చావగాని రామారావు, గంటి రామారావు, అరివికట్ల ప్రేమ్‌కుమార్, మాలోత్ రాము, చల్లగుండ్ల శ్రీనివాసరావు, హరిసింగ్‌నాయక్, బనోత్ బద్రి పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధ్యాయ శిక్షణ తరగతులు

ఖమ్మంఖానాపురంహవేలి, మే30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ మేనేజ్మెంట్‌ల ఉపాధ్యాయులకు 15రోజులుగా మూడు విడతలలో జరిగిన శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయని జిల్లా విద్యాశాఖ అధికారి కె.సత్యనారాయణ, అకాడమిక్ మానటరింగ్ అధికారి రవికుమార్ తెలిపారు. మొత్తం ఐదువేల మందికి శిక్షణ అందించినట్లు తెలిపారు. జూన్12 నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఈ శిక్షణలు తోడ్పడతాయని అన్నారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు


నీళ్లబిందెలతో వస్తున్న మహిళలలు

కామేపల్లి, మే 30(ఆంధ్రజ్యోతి): కామేపల్లి మండలం మద్రిగూడెంలో శ్రీగణపతి, సుబ్రహ్మణ్యేశ్వర, పంచముఖ నాగేంద్ర స్వామి, శీతలాపరేమశ్వరి, ముత్యాలమ్మ తల్లి, అభయ ఆంజనేయస్వామి ఆలయ జీవ ధ్వజస్తంభ పతిష్ఠ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండోరోజు పాతఃకాల అర్చనలు, వేద పారాయణం, ప్రధానహోమాలు, పంచగవ్యాధివాసం, క్షీరాధివాసం జలవాసం తీర్థప్రసాద వినిగ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయ నిర్మాణదాత దిరిశాల నరేష్ స్వాతి దంపతులు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు

జామా మజీద్‌లో గదులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న భద్రయ్య

నేలకొండపల్లి,మే30(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లిలోని జామా మజీద్‌లో విద్యార్థుల కోసం రెండు గదులను నిర్మించటానికి శుక్రవారంముస్లిం పెద్దల సమక్షంలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు నెల్లూరి భద్రయ్య శంకుస్థాపన చేశారు. పేదపిల్లల కోసం గదులను నిర్మించాలని తలపెట్టటం అభినందనీయమన్నారు. గదుల నిర్మాణానికి యండి.వహీద్ ముందుకు రావటం సంతోషించదగ్గ పరిణామమన్నారు. కార్యక్రమంలో నేలకొండపల్లి మజీద్ అధ్యక్షుడు యండి. మహబూబ్‌అలీ, షేక్.సుభాన్,యండి.షాకీర్, షేక్.షర్ఫుద్దీన్, గ్రామీణ వైద్యుడు అహ్మద్, సత్తార్, యాకూబ్, షేక్. ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాలరాస్తున్నారు

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఈదయ్య మాదిగ


ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కూసుమంచి, మే30(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లమంజూరులో తీవ్ర అన్యాయం జరుగుతోందని, అర్హులకు ఇవ్వకుండా, అనర్హులకేపెద్ద పీట వేస్తున్నారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు పగిడికత్తుల ఈదయ్యమాదిగ ఆరోపించారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కూసుమంచి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. నర్సింహులగూడెంలో 15ఇళ్లమంజూరు కాగా, ఒక్కటి కూడా నిరుపేద మాదిగకు ఇవ్వలేదని ఆరోపించారు. కార్యక్రమంలో చింతిరాల నాగభూషణం, పులిపాటి వెంకన్న, పగిడిపల్లి బాబు పాల్గొన్నారు.



విద్యార్థినికి రూ.లక్ష ఆర్థిక సహాయం

చింతకాని, మే 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన విద్యార్థిని తూము దుర్గాభవాని ఖమ్మం రూరల్ మండలం మహాత్మాగాంధీ జ్యోతిభాపూలే గురుకుల పాఠశాల (దానవాయిగూడెం) పదవ తరగతి పరీక్షల్లో పాఠశాల టాపర్‌గా నిలిచింది. 600 మార్కులకు 593 సాధించడంతో ఓ ప్రైవేటు న్యూస్ ఛానెల్ విద్యార్థినికి రూ.లక్ష ఆర్థిక ప్రకటించడంతో శుక్రవారం న్యూస్ ఛానెల్ ప్రతినిధులు విద్యార్థినికి రూ.లక్ష చెక్కును తల్లితండ్రులు, గ్రామస్థుల సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కూరపాటి అనంతరాజు, ఎంపీడీవో చుంచు శ్రీనివాసరావు, ఎంఈవో ఎస్ రామారావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి: తహసీల్దార్



మాట్లాడుతున్న తహసీల్దార్ సునీత ఎల్జిబెత్

ముదిగొండ, మే 30 (ఆంధ్రజ్యోతి): జూన్ 3వతేదీ నుంచి 17వతేదీ వరకు నిర్వహించనున్న భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సునీత ఎల్జిబెత్ రైతులకు సూచించారు. శుక్రవారం మండల కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రైతులు ఈ సదస్సుల్లో వారి భూసమస్యలపై దరఖాస్తులు చేసుకోవచ్చునని తెలిపారు. ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

గరికపాడులో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



పచ్చిరొట్ట విత్తనాల బ్యాగ్‌ను అందిస్తున్న సొసైటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి

వైరా, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరికపాడు సొసైటీలో శుక్రవారం పచ్చిరొట్ట విత్తనాల పంపిణీని అధ్యక్షుడు అయిలూరి కృష్ణారెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న ఈ జీలుగులు, జనుము వంటి పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. వ్యవసాయశాఖ అందిస్తున్న కూపన్లు తీసుకుని రైతులు పచ్చిరొట్ట విత్తనాలు పొందాలని తెలిపారు. ఏవో మయాన్ మంజూఖాన్, ఏఈవో సైదులు, సొసైటీ సీఈవో ఏ.రామకృష్ణ, సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

మధిరరూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): అధిక పాల ఉత్పత్తికి జాగ్రత్తలు తీసుకోవాలని, పాడిపరిశ్రమతో ఇందిరా డైరీ మహిళలు ఆర్థికంగా ఎదగాలని పశుసంవర్థకశాఖ జిల్లా అధికారి డాక్టర్ బి.శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం మధిర మండలం సిరిపురం వంగవీడు గ్రామాలలో ఇందిరాడైరీ మహిల లబ్ధిదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పశుగ్రాసాల ఆవశ్యకత, గేదెల ఎంపిక, అధిక పాల ఉత్పత్తికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మండల పశువైద్యాధికారి ఉమాకుమారి, జూనియర్ వెటర్నరీ అధికారి లక్ష్మణ్, ఐకేపీ డైరీ ఏపీఎం లక్ష్మణరావు, సీసీ కోటేశ్వరరెడ్డి, ఐకేపీ వీఏవోలు, మహిళ సమాఖ్య సభ్యులుపాల్గొన్నారు.

నకిలీ విత్తనాల సరఫరాను అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రా బాబు

వైరా, మే 30 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలను సరఫరాను అరికట్టి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చూడలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎర్రా బాబు కోరారు. రేమల్లె నారాయణ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సీపీఐ ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నకిలీ విత్తనాల విక్రయదారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నప్పటికీ వ్యవసాయశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నకిలీ విక్రయదారుల విషయంలో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటం బాధాకరమన్నారు. ఇప్పటికైనా వ్యవసాయ, రెవెన్యూ అధికారులు నకిలీ విత్తనాలను అరికట్టి నాణ్యమైన విత్తనాలను సరఫరా చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు, నాయకులు ఇటుకాల రామకృష్ణ, లక్ష్మీనారాయణ, గారపాటి అశోక్, ఆదూరి సుధాకర్ పాల్గొన్నారు.

తాటిపూడిలో హెల్మెట్ల పంపిణీ



హెల్మెట్లు పంపిణీ చేస్తున్న భద్రయ్య, బండి గోపాలకృష్ణ

వైరా, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపూడి గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తమ కుమారుడు దుగ్గిరాల మహేష్ జ్ఞాపకార్థం తండ్రి నాగేశ్వరరావు శుక్రవారం వంద హెల్మెట్లను పంపిణీ చేశారు. తన కుమారుడి మాదిరిగా మరెవరూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందకూడదనే భావనతో ద్విచక్రవాహన చోదకులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. తాటిపూడిలో తమ కుమారుడిని ఒక డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో కుడికాలు పాదం పైభాగం వరకు పూర్తిగా తెగిపోవడమేకాకుండా రోడ్డుపైన పడిపోయి తలకు తీవ్రగాయమై శస్త్రచికిత్స చేసినప్పటికీ ఫలితం లేకుండా చికిత్స పొందుతూ వారం రోజుల తర్వాత మృతిచెందడంతో నాగేశ్వరరావు యువకులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ బట్టా పెద్దభద్రయ్య, బండి గోపాలకృష్ణ, తాతా రామచంద్రరావు, బాబు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు కలెక్టర్ ఆదేశం

వైరా, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరికపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి రీసర్వే చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ వైరా ఎంపీడీవోను ఆదేశించారు. తమ గ్రామంలో అర్హత లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని గరికపాడుకు చెందిన మాతంగి ప్రవీణ్, రాంబాబు జిల్లా కలెక్టర్‌కు, రాష్ట్ర గృహనిర్మాణశాఖ ముఖ్యకార్యదర్శికి ఫిర్యాదు చేశారు. అర్హులైన వారికి ఇళ్లు ఇవ్వకుండా అనర్హులను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులుగా ఎంపిక చేశారని ఫిర్యాదు చేయడంతో సర్వే చేయాలని ఎంపీడీవోను కలెక్టర్ ఆదేశించారు.

మునిసిపాలిటీగా అవతరించిన కల్లూరు

- జీవో జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం..
- కల్లూరుతోపాటుగా 8 గ్రామ పంచాయితీలు విలీనం
- ఇకపై మునిసిపాలిటీ చట్టం ప్రకారం పాలన

కల్లూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): కల్లూరు గ్రామ పంచాయితీ మునిసిపాలిటీగా అవతరించింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం జారీ చేసింది. ఇదివరకు కల్లూరు మేజర్ పంచాయితీగా ఉండగా పాలన పరంగా సాగించిన రికార్డులన్నింటిని నిలిపివేసి శుక్రవారం నుంచి మున్సిపాలిటీ చట్టం ప్రకారం పాలన సాగేలా జీవో జారీ చేసింది. దీనికి సంబంధించి రాష్ట్ర మునిసిపాలిటీ కమిషనర్ అండ్ డైరెక్టర్ కార్యాలయం నుంచి కూడా ఆదేశాలు వచ్చాయి. నూతనంగా కొలువుదిరిన కల్లూరు మునిసిపాలిటీ పరిధిలో కల్లూరుతోపాటుగా కప్పలబంధం, కిష్టయ్యబంజరు, హనుమతాండ, తూర్పు లోకవరం, పడమట లోకవరం, పుల్లయ్యబంజర, వాచ్యానాయక్‌తాండ, గ్రామాలను విలీనం చేయటం జరిగింది. ఇకపై ఆయా గ్రామాలన్ని కల్లూరు మునిసిపాలిటీ పేరుతో పాలన సాగుతుంది.



కల్లూరు పట్టణ వ్యూ



మునిసిపాలిటీగా అవతరించిన కల్లూరు కార్యాలయం

పారిశుధ్యం, విద్య, వైద్య, త్రాగునీరు, గృహాల నిర్మాణం వంటి మౌలిక వసతులు, అనుమతులు, పలు రూపాల్లో వచ్చే పన్నులు, స్థిర, చర ఆస్తుల కార్యకలాపాలు కూడా మునిసిపాలిటీ చట్టం ప్రకారం కొనసాగుతాయి. అభివృద్ధి పనులు కూడా అదే స్థాయిలో అమలు జరుగుతాయి. ఇక ఎనిమిది గ్రామ పంచాయితీల పాలన కల్లూరు కేంద్రంగా సాగుతుంది. ఈ మునిసిపాలిటీ పరిధిలో సుమారు 26 వేల జనాభాతో 20 వార్డులుగా విస్తరించారు. ఇప్పటి వరకు కల్లూరుతోపాటుగా విలీనం చేసిన ఎనిమిది గ్రామ పంచాయితీల పరిధిలో పనిచేసిన ఆయా పంచాయితీ కార్యదర్శిలు కూడా తాత్కలికంగా కల్లూరు మునిసిపాలిటీ పరిధిలోనే కొనసాగుతారని తెలిసింది. మున్సిపాలిటీ చట్టం ప్రకారం కల్లూరు మునిసిపాలిటీ పరిధిలో కౌన్సిలర్ల ఎన్నిక జరుగుతుంది. రెవెన్యూ పంచాయితీ కేంద్రంగా ఉన్న కల్లూరు మునిసిపాలిటీగా అవతరించడంతో ఎంతో కాలంగా కల్లూరు అభివృద్ధికి కోసం తపిస్తూ ఎదురుచూసి ఈ ప్రాంత ప్రజల ఆకాంక్ష నేరవేరింది.

ఫలించిన మంత్రి పొంగులేటి, సత్తుపిల్లి ఎమ్మెల్యే రాగమయి కృషి

కల్లూరు మునిసిపాలిటీ ఏర్పాటు విషయంలో ఈ ప్రాంత ప్రజల విజ్ఞాపనలను పరిగణలోకి తీసుకున్న రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనువాసరెడ్డి ఎంతో కృషి చేశారు. గత జనవరి నెలలో కల్లూరులో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి శంఖుస్థాపన సభలో కల్లూరు మునిసిపాలిటీ విషయమై స్పష్టమైన హమీ ఇచ్చారు. ఈ మేరకు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి కూడ మంత్రి దృష్టికి తీసుకోరావటం జరిగింది. దీంతో కల్లూరు మేజర్ పంచాయితీని ఉన్నతిగా మారుస్తూ ప్రభుత్వ తరుపున గెజిట్ కూడా చేయించటంలో మంత్రి పొంగులేటి సఫలికృతులయ్యారు. ఈ ప్రాంత ప్రజానీకం మంత్రి పొంగులేటికి, ఎమ్మెల్యే రాగమయికి కృతజ్ఞతలు తెలిపారు.

కమిషనర్‌గా ఎ.సంపత్‌కుమార్



కల్లూరు మునిసిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్‌గా ఎ. సంపత్ కుమార్ శుక్రవారం పాలన పరంగా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం మధిర మునిసిపాలిటీ కమిషనర్‌గా ఆయన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మున్సిపాల్ కమిషనర్ అండ్ డైరెక్టర్ కార్యాలయం నుంచి ఈ మేరకు ఆదేశాలు అందినాయి. టౌన్ ప్లానింగ్ మేనేజర్‌గా వలసాల శ్రీనువాసరావు కూడా బాధ్యతలు చేపట్టారు.

ముగిసిన ఎన్‌సీసీ శిక్షణ శిబిరం



ఎన్‌సీసీ అధికారులకు జ్ఞాపిక అందజేస్తున్న డాక్టర్ భూమేశ్వరరావు

వైరా, మే 30 (ఆంధ్రజ్యోతి): వైరాలోని న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో పదిరోజులు నిర్వహించిన ఎన్‌సీసీ క్యాంపు శిక్షణ శిబిరం శుక్రవారంతో విజయవంతంగా ముగిసింది. ఈశిక్షణ శిబిరం ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఈ శిక్షణ శిబిరం ద్వారా దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, శారీరక దృఢత్వం వంటి అంశాలు విద్యార్థులు నేర్చుకున్నారు. ఎన్‌సీసీ ఆఫీసర్ కల్నల్ ఎస్‌కే.భద్ర, ఏవో కల్నల్ నవీన్‌యాదవ్, ఏఎన్‌వో సీహెచ్. అపురూపదేవి ఈ శిక్షణ శిబిరాన్ని విజయవంతంగా కొనసాగించారు. ముగింపు కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్, ఏవో ఎస్.నర్సింహారావు పాల్గొన్నారు.

స్థలం కోసం తల్లిని గెంటేశారు

- ఇంటికి తాళం వేసిన కుమారులు
- ఆర్డీవో మందలించినా మారని తీరు



రావికంపాడులో తాళం వేసిన ఇంటి ముందు నిరీక్షిస్తున్న తల్లి

కల్లూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): 70 సంత్సరాల వయస్సు గల ఓ వృద్ధురాలైన తల్లి నివాసం ఉంటున్న ఒక కుంట ఇంటి స్థలంపై కన్నేసిన ఇద్దరు కొడుకులు సదరు ఇంటికి తాళం వేసి తల్లిని గెంటివేసిన వైనం శుక్రవారం వెలుగు చూసింది. అమానుషాకరమైన ఈ సంఘటనకు సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కల్లూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామ పంచాయితీ శివారు రావికంపాడు గ్రామానికి చెందిన తేనె నాగమ్మ(70) ఒంటరి మహిళ. గత ఐదు సంత్సరాల క్రితం భర్త లక్ష్మయ్య మృతి చెందడంతో తనకు గల ఒక కుంట స్థలం ఇంట్లో నివాసం ఉంటుంది. నాగమ్మకు ఆరుగురు మగ సంతానం. డెబ్బై సంత్సరాల వయస్సులో ప్రభుత్వం తరుపున అందుతున్న ఆసరా పెన్షన్ రూ. 2 వేలతో పాటుగా, కూలి నాలి చేసుకుని తన జీవితం గడుపుతుంది. ఇలా ఆరుగురు సంతానంలో ఇద్దరు కుమారులైన తేనె జగన్నాథం, తేనె వెంకటేశ్వరరావులు వృద్ధురాలైన తల్లి ఉంటున్న ఇంటి స్థలంపై కన్నేశారు. మిగిలిన నలుగురు కొడుకులు తేనె శ్రీను, కృష్ణయ్య, అర్జున్, శేషయ్యలు మాత్రం తల్లి వైపున సానుకూలంగా ఉన్నారు. తమ తల్లి తదనంతరం సదరు ఇంటి స్థలం పంపిణీ చేసుకునేందుకు అంగికరించారు. ఇలా మాతృమూర్తి సంరక్షణను వదిలివేసి ఇంటి స్థలంపై కన్నేసిన ఇద్దరు కొడుకులు జగన్నాధం, వెంకటేశ్వరరావులు బుధవారం తల్లి నాగమ్మ ఉంటున్న ఇంటికి తాళం వేసి బయటకు గెంటివేశారు. దీంతో వృద్ధురాలైన ఆ తల్లి కూడు, గూడు నివాసం లేక ఇబ్బందులు పడుతుంది. గ్రామస్థుల సహకారంతో తనకు న్యాయం చేయాలని ఆ వృద్ధురాలు కల్లూరు పోలీసులను ఆశ్రయించగా ఈ కేసు తమ పరిధిలో కాదని చెప్తూ ఆర్డీవో వద్దకు సిఫార్సు చేశారు. స్పందించిన ఆర్డీవో ఎల్ రాజేంద్ర గౌడ్ నాగమ్మ సంతానం గల ఆరుగురు కొడుకులను శుక్రవారం తన కోర్టు పరిధిలోకి పిలిపించి ప్రాథమికంగా విచారణ జరిపారు. ఇంటి తాళం వేసిన కొడుకులిద్దరిని ఆర్డీవో రాజేంద్రగౌడ్ సీరియస్‌గా మందలించారు. సత్వరమే ఇంటికి వేసిన తాళం తీసి తల్లికి ఇంటిలోకి ప్రవేశం కల్పించాలని ఆదేశించారు. అయినప్పటికి ఆ ఇద్దరు కొడుకులు శుక్రవారం సాయింత్రం వరకు ఇంటి తాళం తీయలేదని తెలిసింది. నాగమ్మ కొడుకులకు ఈ విషయమై నోటీసులు అందించామని, మంగళవారం తమ పరిధిలో తుది విచారణ జరిపి నాగమ్మకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో రాజేంద్రగౌడ్ చెప్పారు.

రైతుల ఖాతాల్లోనే జమ చేయాలి



పోలీస్‌స్టేషన్ వద్ద బాధిత రైతులతో కలిసి మాట్లాడుతున్న రాంబాబు

వైరా, మే 30 (ఆంధ్రజ్యోతి): కావేరి విత్తన కంపెనీ యాజమాన్యం, ఆర్గనైజర్లు, ఏజెంట్ వెంటనే విత్తన మొక్కజొన్న విక్రయించిన రైతులకు డబ్బులు చెల్లించాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. విత్తన కంపెనీల అరాచకాలపై ఉద్యమం చేపట్టామని తెలిపారు. శుక్రవారం వైరాలో కామేపల్లి, జూలూరుపాడ్, కొణిజర్ల, వైరా మండలాల్లో కావేరి విత్తన మొక్కజొన్న సాగుచేసిన బాధిత రైతులతో నిర్వహించిన సమావేశంలో రాంబాబు మాట్లాడారు. విత్తన కంపెనీ వారు రైతుల బ్యాంకు ఖాతాలో నేరుగా డబ్బులు జమ చేయకుండా కంపెనీ ఏజెంట్ బ్యాంకు ఖాతాకు జమచేయడంతో రైతులకు ఏజెంట్ డబ్బులు ఇవ్వకుండా తప్పించుకుని తిరుగుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ధ్వజమెత్తారు. ఇలాంటి విత్తన కంపెనీలు ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విత్తన కంపెనీలు రైతులకు అధిక దిగుబడి, అధిక ధరల ఆశ చూపి తర్వాత నిలువునా ముంచుతున్నాయని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం నూతన విధానం చట్టాన్ని రూపొందించి కంపెనీల మోసాలకు రైతులు బలికాకుండా చూడాలని కోరారు. రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు చింతనిప్పు చలపతిరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్‌కు శంఖుస్థాపన



కమ్యూనిటీ హాల్‌కు శంఖుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

సత్తుపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం కొమ్మేపల్లి కాలనీలో శుక్రవారం రూ. 70 లక్షల అంచనాతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్‌ను సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి శంఖుస్థాపన చేశారు. సింగరేణి సంస్థ నిధులతో ఈ కమ్యూనిటీ హాల్‌ను నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడుమట్టా దయానంద్, సిగరేణి కొత్తగూడెం ఏరియా మేనేజర్ పాలెం రాజు, పిఓలు ప్రహ్లాద, నరిసింహారావు, పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వుల్లో లోపాలను సవరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గుగులోతు రామకృష్ణ

బోనకల్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వుల్లోని లోపాలను సవరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ డిమాండ్ చేశారు. బోనకల్‌లో శుక్రవారం జరిగిన ఆ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్దుబాటు ప్రక్రియ ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసేలా ఉన్నాయని ఆరోపించారు. 60 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లు ఎలా బోధన చేస్తారని ప్రశ్నించారు. రేషనలైజేషన్ జీవో 25ను సవరించాలని కోరారు. బడిబాట పూర్తైన తరువాత విద్యార్థుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని సర్దుబాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ నాయకులు చినరంగారావు, గోపాలరావు, సౌభాగ్యం, నర్సింహరావు, కోటయ్య, సురేష్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధులకు చిరస్థాయి గుర్తింపు

బోనకల్, మే 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధులకు ప్రజల మనస్సుల్లో చిరస్థాయి గుర్తింపు ఉంటుందని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు తెలిపారు. మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో శుక్రవారం తెలంగాణ సాయుధ పోరాట యోధుడు తమ్మారపు భద్రయ్య సతీమణి భద్రమ్మ 7వ వర్ధంతి సందర్భంగా స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భర్త చేసిన పోరాటాలకు ఆమె బాసటగా నిలిచిందన్నారు. ఎన్నో కష్టాలను అనుభవించిన భద్రమ్మ జీవన పోరాట స్ఫూర్తి నేటి మహిళలకు ఆదర్శమన్నారు. ఏఐకేఎస్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జక్కుల రామారావు, తమ్మారపు వెంకటేశ్వర్లు, తమ్మారపు బ్రహ్మం, బిక్షాలు, బార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవే లయన్స్‌క్లబ్ లక్ష్యం

కల్లూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవే లయన్స్‌క్లబ్ లక్ష్యమని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ రేపాల మదనమోహన్ అన్నారు. కల్లూరులో శుక్రవారం ఏర్పాటైన కల్లూరు లయన్స్‌క్లబ్ శాఖ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ ఏడాది జిల్లాలో లక్ష మందికి కంటి చూపు పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. ఇంకాను మూడు లక్షల మందికి ఆహారం అందించడం జరగుతుందని అన్నారు. జిల్లాలో నూతనంగా ఎంపికైన పీఎస్టీ, జీవీటీ సభ్యులకు అధికారాలు, బాధ్యతలు విధుల గురించి అవగాహన కల్పించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



విత్తన దుకాణాలలో తనిఖీలు నిర్వహిస్తున్న

కారేపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండలంలో శుక్రవారం విత్తన దుకాణాలలో టాస్క్‌ఫోర్స్ అధికారులు తనీఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయశాఖఅధికారి బట్టుఅశోక్‌కుమార్,ఎస్ఐ ఎం.రాజారాం మాట్లాడుతూ.. ఎవరైన దుకాణాలలో నకిలివిత్తనాలు విక్రయిస్తే వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. తప్పనిసరిగ రైతులకు బిల్లులు ఇవ్వలన్నారు.

బోనకల్, మే 30 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మధిర ఏడీఏ స్వర్ణ విజయచంద్ర, ఎస్ఐ వెంకన్నలు హెచ్చరించారు. బోనకల్ గ్రామంలోని విత్తన దుకాణాలను శుక్రవారం వారు తనిఖీ చేశారు. లైసెన్సులు, రికార్డులను పరిశీలించారు. అనుమతులు ఉన్న డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. బిల్లులు లేకుండా విత్తనాలను విక్రయిస్తే తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు.

మధిరరూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): మధిరలోని విత్తన దుకాణాల్లో శుక్రవారం టాస్క్‌ఫోర్సు బృందం తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా విత్తన దుకాణదారులు లైసెన్స్‌లు, విత్తనాల స్టాక్‌ను పరిశీలించారు. సీఐ రమేష్ ఏవో సాయిదీక్షిత్ మాట్లాడుతూ.. విత్తనాల కొనుగోలు సమయంలో బిల్లును తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. బిల్లును పంటపూర్తయ్యే వరకు బద్రపరుచుకోవాలన్నారు.

చింతకాని, మే 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామాల్లోని విత్తన దుకాణాలను మండల టాస్క్‌ఫోర్స్ బృందం శుక్రవారం ఆకస్మిక తనఖీ చేసింది. ఈ సందర్భంగా దుకాణాల్లో రిజిస్టర్లను, విత్తన ప్యాకెట్లను పరిశీలించారు. విత్తన కొనుగోలుకు సంబంధించిన బిల్లులను తనఖీ చేసి డీలర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏవో సోములపల్లి మానస, ఎస్ఐ నాగుల్‌మీరా, ఏఈవోలు పాల్గొన్నారు.

ముదిగొండ, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువులు, విత్తన దుకాణాలను శుక్రవారం ఏవో సరిత, ఎస్ఐ అనంతరాములు తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో స్టాక్ వివరాలు, రిజిస్ట్రర్లను పరిశీలించారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. షాపు యజమానులు స్టాక్ వివరాలు, ధరల పట్టికను ప్రదర్శించాలని సూచించారు. రైతులు తాము కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించిన రసీదులను భద్రపర్చుకోవాలన్నారు.

చింతకాని, మే 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామాల్లోని విత్తన దుకాణాలలో మండల టాస్క్‌ఫోర్స్ బృందం శుక్రవారం ఆకస్మిక తనఖీ చేశారు. దుకాణాల్లో రిజిష్టర్లను, విత్తన ప్యాకెట్లను పరిశీలించారు.

రోడ్డు నిర్మాణ పనులు అడ్డుకున్న అఖిలపక్షం



రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్న అఖిలపక్షం నాయకులు

వైరా, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎంతో కీలకమైన వైరా రిజర్వాయర్ రోడ్డు వెడల్పును కుదించితే సహించేది లేదని, 60అడుగుల వెడల్పుతో రోడ్డుకు ఇరువైపులా బౌండరీలు ఖరారు చేయాలని, భవిష్యత్ తరాలకు బంగారు బాటలు వేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని అఖిలపక్ష రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి. ఆ మేరకు శుక్రవారం 26అడుగుల రోడ్డు నిర్మాణ పనులను అఖిలపక్షం ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. వైరాలోని జాతీయ ప్రధాన రహదారి నుంచి రిజర్వాయర్ కుడి కాల్వ వరకు 26అడుగుల వెడల్పుతో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను అఖిలపక్ష రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో అడ్డుకుని మునిసిపల్ డీఈ నరేష్‌రెడ్డిని నిలదీశారు. ఈ రోడ్డు నిర్మాణానికి సంబంధించి రిజర్వాయర్ నిర్మాణ సమయం నుంచి నేటివరకు రిజర్వాయర్ రోడ్డు వంద అడుగుల వెడల్పు ఉందని అప్పటి పెద్దలు చెపుతున్నారని, ఆ రోడ్డు నిర్మాణ పనులు ప్రతిపాదించిన గతంలో ఉన్న మునిసిపల్ పాలకవర్గం వంద అడుగుల వెడల్పు ఉన్న రోడ్డును 60అడుగుల వెడల్పుకు కుదిరించి నిర్మాణ పనులకు ప్రతిపాదనలు పంపించిన విషయాన్ని అఖిలపక్ష నాయకులు గుర్తుచేశారు. నిధులు మంజూరై ప్రారంభించిన నేటి పాలకులు 60అడుగుల వెడల్పు రోడ్డును 26అడుగులకు కుదించి నిర్మాణం చేపట్టారని, బీటీ రోడ్డు మధ్యలో డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుచేయాలని ఎస్టిమేట్లు ఉన్నట్లు అధికారులు, కాంట్రాక్టర్లు చెప్పటంపై నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపాదించిన మేరకు నిర్మాణ పనులు చేస్తున్నామని డీఈ నరేష్‌రెడ్డి అఖిలపక్ష నాయకులకు చెప్పడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్దిష్టంగా అన్ని రకాల కొలతలు చూపించిన తర్వాత మాత్రమే నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేసి పనులను అడ్డుకున్నారు. లేనట్లయితే ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. మాజీ ఎంపీపీ బొంతు సమత, సీపీఎం డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకూరి చలపతిరావు, పట్టణ అధ్యక్షుడు బొల్లేపల్లి శ్రీనివాసరావు, నాయకుడు సూర్యదేవర వెంకటకృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు, సీపీఎం నాయకులు సుంకర సుధాకర్, పారుపల్లి కృష్ణారావు, కొంగర సుధాకర్, అమరనేని కృష్ణ, గుడిమెట్ల మోహన్‌రావు, యనమద్ది రామకృష్ణ పాల్గొన్నారు.